ప్రజాశక్తి

గురువారం 9 అక్టోబర్ 2025 | 8 పేజీలు

ఎన్‌టిఆర్ | కృష్ణా











కౌన్సిల్లో మాట్లాడుతున్న సిపిఎం ఫ్లోర్‌లీడర్ సత్యబాబు, టిడిపి, వైసిపి కౌన్సిలర్లు, కమిషనర్ ధ్యానచంద్ర

అతిసారపై అట్టుడికిన కౌన్సిల్

- సమస్యను లేవనెత్తిన సిపిఎం ఫ్లోర్‌లీడర్ సత్యబాబు
- అధికార వైసిపి, టిడిపి సభ్యుల మధ్య వాదోపవాదాలు
- కృష్ణానది పక్కనే ఉన్నా రక్షిత మంచినీరు ఇవ్వకపోవడం సిగ్గు చేటు : మేయర్
- వ్యాప్తికి కారణాలు వెల్లడించాలి : శ్రీశైలజ డిమాండ్
- నాలుగు ఆర్ఒ ప్లాంట్ల నీరే కారణం : కమిషనర్

ప్రజాశక్తి-విజయవాడ: అతిసార విజృంభణ, బుడమేరు వరద ముంపు నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవడంలో ప్రభుత్వ వైఫల్యంపై నగర పాలక సంస్థ కౌన్సిల్ సమావేశం అట్టుడికింది. సింగ్‌నగర్ 57వ డివిజన్ న్యూఆర్‌ఆర్‌పేటలో అతిసార) సోకి పలువురు మరణించడం, వందలాది మంది ఆస్పత్రిపాలవడం, వేలాది మంది ఇక్కట్లకు గురికావడం, బుడమేరు వరద ముంపు నివారణకు సరైన చర్యలు తీసుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. విజయవాడ నగర కాలక సంస్థ కౌన్సిల్ సమావేశం మేయర్ రాయన భాగ్యలక్ష్మి అధ్యక్షతన బుధవారం కౌన్సిల్ హాలులో జరిగింది. సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు లేవదీసిన ఈ అంశాల చుట్టూతే కౌన్సిల్ సమావేశం సాగింది. అధికార వైసిపి, టిడిపి సభ్యుల మధ్య వాదోపవాదాలు, ఒకరిపై మరొకరు ఆరోపణలు, ప్రత్యారోపణలతో రగడ చోటు చేసుకుంది. అతిసారపైనే 45 నిమిషాల (మిగతా 2లో)

రేపటి నుండి ఆరోగ్య శ్రీ సేవలు బంద్

- ఉమ్మడి కృష్ణాలో రూ.252 కోట్లకు పైగా బకాయిలు
- నిలిచిపోనున్న అత్యవసర చికిత్సలు

ప్రజాశక్తి-హెల్త్ యూనివర్శిటీ

ఆరోగ్య శ్రీ సేవల కింద ప్రైవేటు ఆసుపత్రులకు బిల్లులు చెల్లించకపోవడంతో ఈ నెల 10వ తేదీ నుండి వైద్య సేవలను నిలిపివేసేందుకు సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్స్ నిర్ణయించాయి. ఇప్పటికే దీనిపై ప్రయివేట్ నెట్‌వర్క్ ఆసుపత్రులు సమావేశం నిర్వహించాయి. ఆరోగ్యశ్రీ కింద పెండింగ్‌లో ఉన్న బకాయిలను చెల్లించాలని లేనిపక్షంలో వైద్య సేవలను నిలిపివేస్తామని పలుమార్లు ప్రభుత్వానికి తెలియజేశాయి. దీనిపై ప్రభుత్వం ఇప్పటి వరకు స్పందించకపోగా కొద్ది మొత్తంలో కూడా నిధులు విడుదల చేయలేదు. దీంతో ఓపి సేవలతో పాటు ఇన్వెస్టిగేషన్ సేవలు అన్ని సేవలను నిలిపివేస్తామని ప్రకటించాయి.

ఉమ్మడి కృష్ణాలో రూ.252 కోట్లు బకాయిలు

ఉమ్మడి కృష్ణాజిల్లాలో సుమారు 26 ఆసుపత్రులకు సంబంధించి రూ.252 కోట్లకుపైగా బకాయిలు ఉన్నట్లు ఆసుపత్రి నిర్వాహకులు తెలిపారు. దీనిపై ఇప్పటికే ఆరోగ్యశ్రీ ట్రస్టుకు, ప్రభుత్వ ఉన్నతాధికారులకు తెలియజేసినా పట్టించుకోవడం లేదని అంటున్నారు. ఆసుపత్రులలో వైద్య సేవలను (మిగతా 2లో)

జోరుగా కల్తీ మద్యం విక్రయాలు ?

- ఇబ్రహీంపట్నం నుంచే సరఫరా !
- బెల్ట్ షాపుల ద్వారా అమ్మకాలు
- ఎక్సైజ్ సిబ్బందే మద్యం షాపుల బినామీలు
- ఓ మద్యం షాపుకు ఎ1 నిందితుడు బీనామీ

ప్రజాశక్తి - కంచికచర్ల


రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన కల్తీ (నకిలీ) కల్తీ మద్యం వ్యాపారం ఎన్‌టిఆర్ జిల్లా కంచికచర్ల ప్రాంతంలోనూ ప్రకంపనలు సృష్టిస్తోంది. ఈ ప్రాంతంలో బెల్ట్ షాపుల ద్వారా కల్తీ మద్యం విక్రయాలు జరిగాయనే ఆరోపణలు బలంగా వినబడుతున్నాయి. కంచికచర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలోని కంచికచర్ల, వీరులపాడు మండలాల పరిధిలో 8 మద్యం షాపులున్నాయి. ఈ షాపులకు అనుబంధంగా ఈ రెండు మండలాల్లో ఎక్సైజ్ శాఖ అధికారుల కన్నుసన్నల్లో దాదాపు 150కిపైగా బెల్ట్ షాపుల ద్వారా పగలూ రాత్రి తేడలేకుండా విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. కంచికచర్లలోని ఓ మద్యం షాపుతోపాటు వీరులపాడు మండలం జుజ్జూరు సమీపంలో గల మద్యం షాపుల నుంచి ఆయా గ్రామాల్లోని పలు బెల్ట్ షాపులకు కల్తీ మద్యం సరఫరా అయినట్లు తెలిసింది. అన్నమయ్య జిల్లా ములకలచెరువులో బయటపడ్డ కల్తీ మద్యం తయారీ కేసులో ఎ1 నిందితుడిగా ఉన్న అద్దెపల్లి జానర్ధన్‌కు చెందిన గుడౌన్లో నిల్వ చేసిన కల్తీ మద్యాన్ని అధికారులు ఇబహీంపట్నంలో సీజ్ చేసిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో



కంచికచర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల ఓ మద్యం దుకాణానికి కూడా అద్దెపల్లి జానర్దన్ బినామీ వాటాదారుడేనని పలువురు చెబుతున్నారు. జుజ్జూరు సమీపంలో నిర్విహిస్తున్న మద్యం దుకాణానికి స్థానిక ఎక్సైజ్ సిబ్బందితో పాటు ఎక్సైజ్‌స్టేషన్ కాంట్రాక్ట్ ఉద్యోగి బీనామిగా ఉన్నట్లు ప్రజలు బహిరంగంగానే చర్చించుకుంటున్నారు. ఇబ్రహీంపట్నం నకిలీ మద్యం గోడౌన్ నుండి ఈ ప్రాంతంలోని మద్యం షాపులకు, అక్కడ నుంచి బెల్ట్ షాపులకు సరఫరా చేసినట్లు తెలిసింది. కల్తీ మద్యం విక్రయదారులు తయారు చేసిన నకిలీ స్టిక్కర్లును బాటిళ్లకు అంటించి యథేచ్ఛగా అమ్మకాలు జరిపారని తెలిసింది. ములకలచెరువులో ఈ వ్యవహారం గుట్టురట్టయిన (మిగతా 2లో)

జాయింట్ ఎల్‌పిఎంలతో చిక్కులు

- భూముల క్రయవిక్రయ రిజిస్ట్రేషన్లకు ఆటంకం
- జిల్లా కార్యాలయాల చుట్టూ రైతులు ప్రదక్షిణలు



ప్రజాశక్తి - కృష్ణా ప్రతినిధి

రీ సర్వే పూర్తయి సర్వే నంబర్ల స్థానంలో జాయింట్ ల్యాండ్ పార్శిల్ మ్యాప్ (ఎల్‌పిఎం)లు ఇవ్వడం సమస్యగా మారింది. ఈ తరహా ఎల్‌పిఎంలు కేటాయించిన వ్యవసాయ భూములపై బ్యాంకుల నుంచి రైతులు పంట రుణాలు తీసుకోవడం ఇబ్బందిగా మారింది. కుటుంబ అవసరాలకు క్రయ విక్రయాలు చేసుకునే అవకాశం లేకుండా పోయింది. ఈ భూములు సబ్ డివిజన్ చేసి వాస్తవ హక్కుదారుల పేరుతో మ్యూటేషన్ చేసి వ్యక్తిగత ఎల్‌పిఎంలు కేటాయించడంలో తీవ్ర జాప్యం జరుగుతోంది. ఏడాదిన్నరలో సవరణకు వచ్చిన వెయ్యికిపైగా వచ్చిన దరఖాస్తుల్లో మూడు వందలకుపైగా పెండింగ్‌లోనే ఉన్నాయి.

గూడూరు మండలంలోని ఓ గ్రామనికి చెందిన వ్యక్తికి 52 సెంట్ల వ్యవసాయ భూమి ఉంది. భూముల రీ సర్వే తర్వాత సర్వే నంబర్లను మార్చి ల్యాండ్ పార్శిల్ మ్యాప్ (ఎల్‌పిఎం)లను కేటాయించారు. సదరు వ్యక్తితోపాటు అతని సోదరులు, సోదరి, తల్లిదండ్రుల పేర్లతో జాయింట్ ఎల్‌పిఎం ఇచ్చారు. దీంతో ఈ భూమిపై బ్యాంకు రుణాలు తీసుకోవాలన్నా, క్రయ విక్రయ లావాదేవీలు చేయాలన్నా సమస్యగా మారింది. ఈ భూమికి కేటాయించిన ఎల్‌పిఎం సబ్‌డివిజన్ చేసి మ్యూటేషన్ సవరించాలని భూమి హక్కుదారుడు పలు సార్లు దరఖాస్తు చేసుకున్నారు. అధికారులు మ్యూటేషన్ చేయకపోవడంతో ఒకటికి పదిసార్లు మండల, డివిజన్ రెవెన్యూ, జిల్లా భూముల సర్వే కార్యాలయాలు చుట్టూ ప్రదక్షణ చేస్తున్నారు. ఈ గ్రామంతోపాటు, జిల్లాలో రీ సర్వే పూర్తయిన గ్రామాల్లో పలువురు రైతులు ఇదే సమస్యను ఎదుర్కొంటున్నారు. జిల్లావ్యాప్తంగా రీసర్వే పూర్తయి జాయింట్ ఎల్‌పిఎంలు కేటాయించిన భూముల హక్కు మార్పు మ్యూటేషన్‌కు ఏడాదిన్నరకాలంలో 1082 మంది దరఖాస్తు చేశారు. 700 మంది భూములకు మాత్రమే సబ్ డివిజన్ చేసి భూమి హక్కుదారుని పేరుతో మార్చారు. మరో 382 దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి.

ఎన్నికలకు ముందే 290 గ్రామాల్లో భూములకు ఎల్‌పిఎంలు

సార్వత్రిక ఎన్నికలకు ముందు జిల్లాలోని 290 గ్రామాల్లో భూములు రీ సర్వే పూర్తి చేశారు. రీ సర్వే సమయంలో భూములు విస్తీర్ణం నమోదులో హెచ్చుతగ్గులు చోటు చేసుకోవడంపై వేలకొలదీ ఫిర్యాదులు వచ్చాయి. ఆయా గ్రామాల్లో పలువురి రైతులకు సర్వే నంబర్ల స్థానంలో జాయింట్ ఎల్‌పిఎంలు కేటాయించారు. అయితే వీటితో బ్యాంకుల్లో పంట రుణాలు తీసుకునే క్రమంలో రైతులకు సమస్య ఎదురవుతోంది. దరఖాస్తు చేసుకున్న రైతులు నెలల తరబడి కార్యాలయాల చుట్టూ ప్రదక్షణలు చేయాల్సి వస్తోంది.

సిజెఐపై దాడి హేయం



ప్రకాష్‌నగర్ సెంటర్‌లో నిరసన తెలుపుతున్న ప్రజా సంఘాల నాయకులు వార్త 3లో

విజయవాడలో ప్రజా సంఘాల నిరసన

మొదటిపేజీ తరువాయి

రేపటి నుండి ఆరోగ్యశ్రీ సేవలు బంద్

అందించేందుకు మందులు, ఇతర శస్త్రచికిత్సకు సంబంధించిన పరికరాలు, మొదలైన వాటిని ముందుగానే తాము తెచ్చుకుంటున్నామని, వైద్య సేవలు అందించిన తరువాత నెలల తరబడి కూడా బిల్లులు రాకపోవడంతో తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నట్లు ఆసుపత్రి యాజమాన్యాలు చెబుతున్నాయి.

అన్ని సేవలు నిలిపివేస్తాం
ఆంధ్రప్రదేశ్ సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ అసోసియేషన్ అధ్యక్షులు డాక్టర్ విజయకుమార్

ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పెండింగ్ నిధులు చెల్లించకపోవడంతో ఈనెల 10వ తేదీ నుండి ఆరోగ్యశ్రీ పరిధి కిందకు వచ్చే వైద్యసేవలను నిలిపివేస్తాం. రాష్ట్ర వ్యాప్తంగా 425 వివిధ నెట్‌వర్క్ ఆసుపత్రులకు సుమారు రూ.2,700 కోట్లు బకాయిలు ఉన్నాయి. ఇప్పటికే పలు దఫాలుగా ప్రభుత్వానికి, ప్రభుత్వ అధికారులకు విన్నవించినా స్పందించలేదు. ఈసారి ఓపి సేవలతో పాటు ఇన్‌పేషెంట్ సేవలు ఇతర సేవలను కూడా నిలిపివేస్తాం.

జోరుగా కల్తీ మద్యం విక్రయాలు?

మరుసటి రోజే ఆయా షాపుల పరిధిలో బెల్ట్ షాపులకు సరఫరా చేసిన కల్తీ మద్యం బాటిళ్లను ధ్వంసం చేసి తగల బెట్టినట్లు తెలిసింది. అయితే ఇంకొందరి వద్ద కల్తీ మద్యం నిల్వలు ఇంకా ఉన్నట్లు ఆరోపణలు వస్తున్నాయి.

మద్యం షాపులు తనిఖీ
కల్తీ మద్యం లేదు : ఎక్సైజ్ సిఐ అప్రున్నీసాబేగం

కంచికచర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల పలు మద్యం షాపుల్లో ఎక్సైజ్ సిఐ అప్రున్నీసాబేగం తన సిబ్బందితో కలిసి మంగళవార తనిఖీలు నిర్వహించారు. వీరులపాడు మండలం శరవణ భవ, లక్ష్మీ గణేష్, వెల్లంకిలో రాయల్ వైన్స్, కంచికచర్ల మండలంలోని ఐదు షాపులను తనిఖీలు చేశారు. మద్యం షాపుల వద్ద, షాపులకు అనుసంధానంగా నిర్వహిస్తున్న కూల్ డ్రింక్, కిరాణా షాపుల్లో సైతం తనిఖీలు నిర్వహించినట్లు ఎక్సైజ్ సిఐ తెలిపారు. జిల్లాలో నకిలీ మద్యం వెలుగు చూసిన నేపథ్యంలో విస్తృత తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. రాష్ట్రంలో కల్తీవ్యాపారం బయటపడ్డ అనంతరం సిబ్బందితో కలిసి కంచికచర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అన్ని మద్యం షాపుల్లో తనీఖీలు నిర్వహించినట్లు చెప్పారు. ఎక్కడా కల్తీ మద్యం అమ్మకాలు జరగలేదని చెప్పారు.

బుడమేరు ముంపు నివారణకు శాశ్వత చర్యలేవీ?

- వివిఎంసి కౌన్సిల్లో వాడీవేడి చర్చ
- రహదారుల ప్రైవేటీకరణకు తిరస్కరణ

ప్రజాశక్తి-విజయవాడ: ఏడాది గడిచినా బుడమేరు ముంపు నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవడంలో కూటమి ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందని అధికార వైసిపి, సిపిఎం సభ్యులు ఘాటుగా విమర్శించారు. బుడమేరు ముంపు శాశ్వత నివారణకు ఇప్పటి వరకు కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలు, నిధులు కేటాయింపు తదితర అంశాలను వివరించాలని సిపిఎం ఫ్లోర్‌లీడర్ తీసుకొచ్చిన అంశంపై బుధవారం జరిగిన కౌన్సిల్ సమావేశంలో వాడివేడిగా చర్చ జరిగింది. నివారణా చర్యలకు సంబంధించిన పనులు నేటికీ ప్రారంభించకపోగా, బాధిత ప్రజలకు ఇప్పటికీ సాయం అందలేదని నగర మేయర్ రాయన భాగ్యలక్ష్మి ఆందోళన వ్యక్తం చేశారు. మాయ మాటలు చెబుతూ స్థానిక ప్రజల్లో గందరగోళం సృష్టించడం అలవాటుగా మారిందని డిప్యూటీ మేయర్ అవుతు శ్రీశైలజ మండిపడ్డారు. వరద నివారణ పనుల అంశంపై అసత్య ఆరోపణలు, గాలిమాటలు మాట్లాడవద్దని సత్యబాబు వైపు సీరియస్‌గా చూస్తూ టిడిపి సీనియర్ సభ్యులు ముమ్మనేని ప్రసాద్ చేసిన వ్యాఖ్యలకు ధీటుగా సత్యబాబు స్పందిస్తూ...కౌన్సిల్‌లో రౌడీయిజం చేయాలనుకుంటే కుదరదని...దమ్ము...ధైర్యం ఉంటే చేసిన పనులేమిటో ప్రజలకు వివరించాలని నిలదీశారు. బుడమేరు వరదకు తన డివిజన్‌లోని మధ్యకట్ట ప్రాంత వాసులు అనేక రూపాల్లో నష్టపోయారని, అక్కడి నుంచి తరలించి వేరే చోట పునరావాసం కల్పించాలని అధికారులు చెప్పినా...నేటికీ అమలు కాలేదని వైసిపి సభ్యులు జానారెడ్డి పేర్కొన్నారు. గతంలో వరదలు వచ్చినప్పుడు ఆనాటి వైసిపి ప్రభుత్వం ప్రజలకు ఎంత వరకు సాయం చేసిందని టిడిపి ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి అధికార వైసిపిని ప్రశ్నించారు. బుడమేరు వరద నివారణా పనులకు రూ.54 కోట్లు నిధులు కావాలని విఎంసి తరుపున ప్రభుత్వానికి తెలియజేయగా, రూ. 9.2 కోట్లు మాత్రమే ప్రభుత్వం విడుదల చేసిందని, వాటిని స్ట్రామ్ వాటర్ డ్రైయిన్ల నిర్మాణాలకు ఖర్చు చేయడం జరుగుతుందని చీఫ్ ఇంజినీర్ ఆర్ శ్రీనాధరెడ్డి సమాధానమిచ్చారు. నగరంలోని 23.54 కిలోమీటర్ల పరిధిలోని 19 ప్రధాన రహదారుల నిర్వహణను పిపిపి పద్ధతిలో ప్రయివేటీకరణ చేస్తే ప్రజలకు భారమవుతున్నందున ఎజెండాలోని ఐదవ అంశాన్ని తిరస్కరిస్తున్నట్లు అధికార వైసిపి పేర్కొంది. రీ వెరిఫికేషన్ పేరుతో ఉన్న పింఛన్లను రకరకాల కారణాలతో తొలగిస్తున్నారని వైసిపి, సిపిఎం సభ్యులు ఆరోపించారు. తగిన ఆధారాలు లేని ఐదు వేల మంది రిజక్ట్ అయినా ఏమి చేయాలనేది ఇంకా నిర్ణయం కాలేదని, అంగవైకల్యం 40 శాతం కన్నా తక్కువ ఉన్న 402 మందికి నోటీసులిచ్చామని, అయినా వారికి పింఛన్ ఆగలేదని అన్నారు. విఎంసికి చెందిన పలు విలువైన ఆస్తులు, స్థలాలు కబ్జాకు గురవుతూ, పలు కేసులు హైకోర్టు స్థాయిలో పెండింగ్‌లో ఉంటున్నా ...కేసులు వాదించడంలో 'స్టాండింగ్ కౌన్సిల్' తన పాత్ర తగిన స్థాయిలో ఉండటం లేదని పలువురు సభ్యులు కౌన్సిల్ దృష్టికి తీసుకొచ్చారు. దసరా ఉత్సవాల సందర్భంగా రోజు వారీ కూలీలతో16 రోజుల పాటు శానిటేషన్ పని చేయించుకొని, కనీసంగా కూలి డబ్బులు ఇవ్వకుండా సంబంధిత కాంట్రాక్టర్లు ఇబ్బందులకు గురి చేస్తున్నారని, ఈ విషయంపై అధికారులు జోక్యం చేసుకొని కార్మికులకు న్యాయం చేయాలని సిపిఎం ఫ్లోర్‌లీడర్ సత్యబాబు కోరారు. వీధి కుక్కల బెడద రోజురోజుకు పెరిగిపోతోందని పలువురు సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు. డిఅండ్ఒ ట్రేడ్ లైసెన్స్ లేకుండానే పలువురు వ్యాపారులు భారీ మొత్తంలో వ్యాపారాలు చేస్తూ విఎంసి రాబడికి గండికొట్టే చర్యలకు పాల్పడుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవడం లేదని దీనిపై సమగ్ర విచారణ జరిపించాలని పలువురు కార్పొరేటర్లు పేర్కొన్నారు. నగరపాలక సంస్థ పరిధిలో ట్రేడ్ లైసెన్స్ విధానం అమలులో లోపాలు జరుగుతున్నాయని, దీనిపై ఎటువంటి చర్యలు తీసుకుంటున్నారో తెలపాలని కౌన్సిల్ ప్రశ్నోత్తరాల సెషన్‌లో టిడిపి ఫ్లోర్‌లీడర్ నెల్లిబండ్ల బాలస్వామి అడిగిన ప్రశ్నకు కౌన్సిల్‌లో పెద్ద ఎత్తున చర్చకు దారి తీసింది. తరుచూ రోడ్డు ప్రమాదాల్లో రాణిగారితోట నివాసులు మృత్యువాతపడుతున్నారని, తక్షణమే అండర్ పాస్ నిర్మించాలని కోరుతూ 17వ డివిజన్ వైసిపి కార్పొరేటర్ తంగిరాల రామిరెడ్డి కౌన్సిల్ సమావేశం సందర్భంగా మెడలో నల్లకండువా వేసుకొని నిరసన తెలిపారు.

రోడ్ల ప్రైవేటీకరణ ఆపాలి : సత్యబాబు

విజయవాడ నగరంలో రోడ్డు నిర్వహణ ప్రయివేటీకరణ ఆపాలని, బుడమేరు ముంపు నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవాలని కోరుతూ సిపిఎం ఫ్లోర్‌లీడర్ బోయి సత్యబాబు నిరసన తెలిపారు. కౌన్సిల్ సమావేశంనకు ముందు నినాదాలతో కూడిన బ్యానర్‌ను చేబూని ఆయన విఎంసి కార్యాలయం ప్రాంగణం నుంచి కౌన్సిల్ హాలు వరకు ప్రదర్శిస్తూ నిరసన తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నగరాభివృద్ధికి కూటమి ప్రభుత్వం కృషి చేయకపోగా ప్రజల ఆస్తులను, రహదారులను ప్రయివేటు కంపెనీలకు దారాదత్తం చేస్తుందని విమర్శించారు. ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉన్న టిడ్కో గృహాలను అర్హులయిన లబ్దిదారులకు వెంటనే కేటాయించాలని కోరారు. బుడమేరు ముంపు నివారణకు శాశ్వత చర్యలు తీసుకోవాలని కోరారు.

విజయవాడ సెంట్రల్ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికై, ఇటీవల మృతిచెందిన సినీనటులు కోటా శ్రీనివాసరావుకు కౌన్సిల్ సంతాపం తెలిపింది.

అతిసారపై అట్టుడికిన కౌన్సిల్

పాటు చర్చ నడిచింది. ముందుగా అజెండాలోని అంశాలు చర్చకు పెడుతుండగా, అతిసారపై సమగ్రంగా చర్చించాలని సిపిఎం ఫ్లోర్‌లీడర్ సత్యబాబు పట్టుబట్టారు. ఇదే అదనుగా కూటమి ప్రభుత్వాన్ని లక్ష్యంగా చేసుకొని కౌన్సిల్‌లోని టిడిపి సభ్యులపై అధికార వైసిపి సభ్యులు రెచ్చిపోయి మాట్లాడారు. ఈ విషయంలో కూటమి ప్రభుత్వంతోపాటు కౌన్సిల్‌లోని అధికార వైసిపిది బాధ్యతకాగా, దీని నివారణలో అధికారులు బాధ్యతారాహిత్యంగా వ్యవహరించారంటూ వైసిపి, టిడిపి సభ్యులు పరస్పరం ఒకరిపై ఒకరు నిందారోపణలు చేసుకున్నారు. ఇటు వైసిపి సభ్యులు... అతిసార నివారణలో కూటమి ప్రభుత్వం విఫలమైందని, సూపర్ సిక్స్ పథకాలు విఫలమయ్యాయని, అటు టిడిపి సభ్యులు... సూపర్ సిక్స్ పథకాలు సూపర్ హిట్ అంటూ కొద్ది సేపు నినాదాలు చేసుకున్నారు. అతిసార నివారణలో అధికారులు సరిగా స్పందించలేదని, వారిలో ఎటువంటి చలనం లేకుండా పోయిందని మేయర్ తీవ్రంగా మండిపడ్డారు. బురద వాసన, రంగు మారిన నీరే నేటికీ పైపుల ద్వారా మంచినీరు సరఫరా అవుతోందని, ఈ నీటిని ప్రజలు తాగలేని పరిస్థితుల్లో ఉన్నారని, కృష్ణానది పక్కనే ఉన్నా నగర ప్రజలకు రక్షిత మంచినీరు కూడా ఇవ్వలేని దుస్థితిలో నగరపాలక సంస్థ ఉండడం సిగ్గుచేటని అన్నారు. అతిసార ప్రబలడానికి కారణాలు ఇప్పటికీ వెల్లడించకుడా రకరకాల కట్టుకథలు అల్లుతున్నారని, ఇప్పటికీ రిపోర్టును బయటపెట్టకపోవడంలో ఆంతర్యం ఏమిటని డిప్యూటీ మేయర్, 58వ డివిజన్ కార్పొరేటర్ అవుతు శ్రీశైలజ అధికారులను ప్రశ్నించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపి వచ్చారు...వెళ్లారు తప్పా..ఏ విధమైన సాయం అందించలేదని డిప్యూటీ మేయర్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. నీటి కాలుష్యం వల్లే అతిసార సోకిందని, స్థానికులతోపాటు సిపిఎం కూడా తొలినుంచీ చెబుతూనే వచ్చిందని ఆ పార్టీ ఫ్లోర్‌లీడర్ సత్యబాబు అన్నారు. అతిసార నివారణలో, బాధితులను ఆదుకోవడంలో కూటమి ప్రభుత్వం, విఎంసి ఘోరంగా విఫలమయ్యాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంచినీటి పైప్‌లైన్లలో డ్రైన్లలోని మురుగునీరు కలుస్తోందని, బురద వాసన, రంగు నీరే ప్రజలకు సరఫరా అవుతోందని అన్నారు. ఈ నేపథ్యంలో దెబ్బతిన్న మంచినీటి పైప్‌లైన్లకు మరమ్మతులు చేయాలని, సిబ్బంది కొరతను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఇదే అంశంపై 57వ డివిజన్ కార్పొరేటర్ ఇసరపు దేవి, సీనియర్ కార్పొరేటర్ బండినాగేంద్ర పుణ్యశీల, ఇంకా పలవురు వైసిపి కార్పొరేటర్లు మాట్లాడారు. న్యూ ఆర్‌ఆర్‌పేటలో నడుస్తున్న నాలుగు ఆర్‌ఒ ప్లాంట్లలోని నీరు తాగడం వల్లే అతిసార వ్యాపించిందని అధికారికంగా వచ్చిన రిపోర్టులో తేలిందని, మున్సిపల్ వాటర్ కారణం కాదని విఎంసి కమిషనర్ ధ్యానచంద్ర సమాధానం ఇచ్చారు. ట్రేడ్ లైసెన్స్ కూడా లేని ఈ నాలుగు ప్లాంట్లను సీజ్ చేయడంతోపాటు స్థానిక శానిటరీ ఇన్‌స్పెక్టర్‌కు, ఎఇకి షోకాజ్ నోటీసులు జారీ చేశామని తెలిపారు. రక్షిత మంచినీటి సరఫరాకు తగిన చర్యలు తీసుకుంటున్నట్లు వివరించారు.


మాట్లాడుతున్న వైసిపి సభ్యులు శ్రీశైలజ, బెల్లం దుర్గ, పుణ్యశీల


మాట్లాడుతున్న టిడిపి, వైసిపి ఫ్లోర్‌లీడర్లు బాలస్వామి, సత్యనారాయణ

సిజెఐపై దాడి హేయం

● కెవిపిఎస్ రాష్ట్ర కార్యదర్శి అంధ్ర మాల్యాద్రి

ప్రజాశక్తి-విజయవాడ : సనాతన ధర్మానికి వ్యతిరేకంగా మాట్లాడారని సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తి గవాయ్‌పై చెప్పు విసిరేందుకు ప్రయత్నించిన మతోన్మాద న్యాయవాది కిషోర్‌ను తక్షణమే అరెస్ట్ చేసి, అతనిపై కేసు నమోదు చేసి కఠినంగా శిక్షించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్) రాష్ట్ర కార్యదర్శి అంధ్ర మాల్యాద్రి పేర్కొన్నారు. కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కెవిపిఎస్), ఐద్వా, ఇతర ప్రజా సంఘాల ఆధ్వర్యంలో విజయవాడ ప్రకాష్ నగర్ సెంటర్లో బుధవారం దర్నా జరిగింది. దీనికి కెవిపిఎస్ నాయకులు చింతల శ్రీనివాస్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా అంధ్రమాల్యాద్రి మాట్లాడుతూ... సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిపై మతోన్మాద న్యాయవాది బూటును విసిరివేయడం అత్యంత దుర్మార్గమైన ఘటన దేశానికి అవమానమని పేర్కొన్నారు. ప్రజాస్వామ్య దేశంలో స్వేచ్ఛగా తమ అభిప్రాయాలు చెప్పుకునే అవకాశం కూడా లేకపోవడం బాధాకరమన్నారు. అత్యున్నత పదవులో ఉన్నవారికే ఇలాంటి అవమానాలు జరిగే సామాన్య ప్రజల పరిస్థితి ఏమిటి అని ప్రశ్నించారు. సనాతన ధర్మం పేరుతో కులవ్యవస్థను పెంచేందుకు మనువాద మతోన్మాద శక్తులు ప్రయత్నిస్తున్నాయని అన్నారు. ఆ దుర్మార్గమైన ఆలోచన తోనే ఇలాంటి దాడులు ప్రత్యక్షంగా, పరోక్షంగా జరుగుతున్నాయన్నారు. పాలక ప్రభుత్వాలు ఇలాంటి వాటిని అరికట్టే ప్రయత్నం చెయ్యకపోగా ముద్దాయిలపై కేసులు నమోదు చేసి శిక్షించడం లేదన్నారు. వారిని కాపాడేందుకు ప్రయత్నం చెయ్యడం వలనే ఇలాంటి దుర్మార్గాలు పెరుగుతున్నాయన్నారు. కెవిపిఎస్ జిల్లా కార్యదర్శి గుండిమెడ క్రాంతికుమార్ మాట్లాడుతూ...మతోన్మాద న్యాయవాదిని తక్షణమే అరెస్ట్ చేయాలని కోరారు. అత్యున్నత పదవిలో ఉన్న సుప్రీం కోర్టు గవాయ్ పై చెప్పు తో దాడి చేసేందుకు ప్రయత్నం చేసిన మతోన్మాది కిషోర్ పై చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో ఆందోళన ఉదతం చేస్తామన్నారు.ఈ కార్యక్రమంలో సిఐటియు సెంట్రల్ సిటీ అధ్యక్షులు కే దుర్గారావు , నాయకులు పి వెంకట్ రెడ్డి ,డివైఎఫ్ఐ నాయకులు ,ఎస్‌కె నిజాముద్దీన్, శివలింగేశ్వరరావు. లీలాసాగర్, స్థానిక పెద్దలు రాధాకష్ణ.ఎం శ్రీను అరుణ అమ్ములు కార్మికులు పాల్గొన్నారు.

15న అవనిగడ్డలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-అవనిగడ్డ : ఆంధ్రప్రదేశ్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 15వ తేదీన ఉదయం 9 గంటలకు ఎస్‌వీఎల్ క్రాంతి కళాశాల ప్రాంగణంలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ తెలిపారు. బుధవారం ఎమ్మెల్యే కార్యాలయం వద్ద జాబ్ మేళాకు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ, యువత జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు ఏపీ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో కూటమి ప్రభుత్వం క్రమం తప్పకుండా జాబ్ మేళా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహిస్తోందన్నారు. అవనిగడ్డ నియోజకవర్గంలో పాటు పరిసర గ్రామాల నుంచి పెద్ద సంఖ్యలో యువత తరలివచ్చి ఉద్యోగ అవకాశాలు అందిపుచ్చుకోవాలని ఎమ్మెల్యే కోరారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్ రామ్, నైపుణ్య అభివృద్ధి సంస్థ కోఆర్డినేటర్ జి. పద్మిజ, రాచూరి ప్రశాంత్ పాల్గొన్నారు.

విరాళం అందజేత

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : గుడ్లవల్లేరు శ్రీ రమా సహిత సత్యనారాయణ స్వామి, శ్రీ గంగానమ్మ తల్లి దేవస్థానాల ఆధునీకీకరణ పనులకు బుధవారం లండన్‌లో స్థిరపడిన దాతలు గుడ్లవల్లేరు వాస్తవ్యులు రూ.10 లక్షల విరాళం అందించారు. డాక్టర్ సూర్యదేవర యదు పూర్ణచంద్రరావు, డాక్టర్ జాహ్నవి దంపతులు, వారి కుమారులు డాక్టర్ ఎస్.వంశీ సుచేత్‌రావు, డాక్టర్ ఎస్.సందీప్‌రావు, వల్లభనేని శోభనాద్రి స్మారకార్థం కుటుంబ సభ్యులు ఈ భారీ విరాళాన్ని అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎస్ఈఆర్ఎమ్ విద్యా సంస్థల చైర్మన్ వల్లభనేని వెంకట్రావు, మాజీ జెడ్పీటీసీ కొసరాజు బాపయ్యచౌదరి, గుడ్లవల్లేరు ఏఎంసీ చైర్మన్ పొట్లూరి రవికుమార్, నెహ్రూ పశువుల సంత కమిటీ చైర్మన్ వల్లభనేని సుబ్బారావు, సభ్యులు పాల్గొన్నారు.

20 నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

ప్రజాశక్తి-విజయవాడ : జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియా ధాన్యం కొనుగోలు ,సంబంధిత అంశాలపై టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా స్థాయి ధాన్యం కొనుగోలు కమిటీ సభ్యులు, జిల్లా పౌర సరఫరాల మేనేజర్, ఆర్డీవోలు, తహసీల్దార్లు, ఏఎస్ఓలు, సిఎస్ డిటిలు, ఎడిఏలు, ఎంఏఓలు, వీఏఏలు పాల్గొన్నారు.జిల్లాలో మొత్తం 3,03,154మెట్రిక్ టన్నుల ధాన్యం సాగు జరిగినట్లు జాయింట్ కలెక్టర్ గారు పేర్కొన్నారు. అందులో 2,00,000 మెట్రిక్ టన్నుల ధాన్యాన్ని సకాలంలో కొనుగోలు చేయడానికి తగిన చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ప్రాథమికంగా ఈ నెల 20 నుండి ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రారంభించనున్నట్లు తెలిపారు. అలాగే ఆర్ఎస్‌కెలలో గోనె సంచుల ఏర్పాట్లు మరియు మిల్లుల నుండి బ్యాంక్ గ్యారెంటీ సేకరణ వంటి అంశాలపై సంబంధిత అధికారులకు తగిన సూచనలు ఇచ్చారు. ఈ-క్రాప్ నమోదు పనులను వేగవంతంగా పూర్తి చేయాలని, అలాగే వాహనాల రిజిస్ట్రేషన్ వాహనాలలో జీపీఎస్ వ్యవస్థాపనను త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ సూచించారు.

పశువులతో ప్రమాదాలు జరగకుండా చర్యలు : మంత్రి

ప్రజాశక్తి-కలక్టరేట్ (కృష్ణా) : మచిలీపట్నం రహదారులపై పశువులతో ఎలాంటి ప్రమాదాలు జరగకుండా అన్ని చర్యలు తీసుకున్నామని రాష్ట్ర గనులు భూగర్భవనరులు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పేర్కొన్నారు. బుధవారం కొల్లు రవీంద్ర మచిలీపట్నం వ్యవసాయ మార్కెట్ యార్డులో ఏర్పాటుచేసిన గోశాలను సందర్శించి, విధి విధానాలపై చర్చించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ మచిలీపట్నం మున్సిపల్ పరిధిలో ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్న పశువులను నియంత్రించేందుకు గత ఆగస్టు నెలలో పశువుల శాల ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఇప్పటివరకు 326 పశువులను పశువులశాలలో ఉంచగా, వాటిలో 269 పశువులను యజమానులు రుసుము చెల్లించి తిరిగి తీసుకెళ్లారని వివరించారు.అయితే, 16 పశువులు తీవ్ర అనారోగ్యంతో చనిపోయినట్లు మంత్రి తెలిపారు. వాటికి నిర్వహించిన పోస్టుమార్టం నివేదికలో కడుపులో కుళ్లిపోయిన ప్లాస్టిక్ కవర్లు, జీర్ణం కాని ఆహారం ఉన్నట్లు తెలిసిందని చెప్పారు. ఇకపై ఇలాంటి ఘటనలు జరగకుండా మున్సిపల్ అధికారులు కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రి ఆదేశించారు. పశువుల శాల కార్యకలాపాలను పర్యవేక్షించేందుకు ప్రత్యేక మానిటరింగ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు మంత్రి తెలిపారు. మున్సిపల్ కమిషనర్ బాపిరాజు, మార్కెటింగ్ ఏడి నిత్యానందం, సహాయ మున్సిపల్ కమిషనర్ గోపాలరావు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కుంచె దుర్గాప్రసాద్ (నాని), కార్పొరేటర్లు పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణానికి నిధులు మంజూరు పట్ల హర్షం

ప్రజాశక్తి-కంకిపాడు : పెనమలూరు నియోజకవర్గంలో పలు రోడ్లకు నిధులు మంజూరైనట్లు టిడిపి సీనియర్ నాయకులు తుమ్మలపల్లి హరికృష్ణ తెలిపారు. కంకిపాడు మండలం లోని మద్దూరు - గోసాల రహదారికి 4 కోట్లు, ఈడుపుగల్లు - ఉప్పులూరు రహదారికి 3 కోట్లు, ఉయ్యూరు మండలం లోని బొల్ల పాడు - కాటూరు రహదారికి ఒక కోటి నిధులు మంజూరైనట్లు తెలిపారు. నిధులు విడుదల చేసినందుకు ఎమ్మెల్యే బోడె ప్రసాద్‌కు ధన్యవాదాలు తెలిపారు. ఎన్నో ఏళ్లుగా మరమ్మతులు కూడా నోచుకోని వణుకూరు-మద్దూరు ప్రధాన రహదారికి కూడా నిధులు కేటాయించడం పట్ల పలువురు హర్షం వ్యక్తం చేశారు.

పారిశుద్ధ కార్మికులకు కిట్లు పంపిణీ

కంకిపాడు మండలం ఈడుపుగల్లు గ్రామపంచాయతీ పరిధిలో విధులు నిర్వహిస్తున్న పారిశుధ్య కార్మి కులకు దుస్తులు,ప్రథమ చికిత్స కిట్లు సర్పంచ్ పి ఇందిర బుధవారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కిరణ్ కుమార్, పాల్గొన్నారు.

వసతి గృహం తనిఖీ

ప్రజాశక్తి-విజయవాడ : జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ పాయకాపురంలోని సాంఘిక సంక్షేమ బాలికల వసతి గృహాన్ని బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. విద్యార్థులకు తాగునీరు అందిస్తున్న వ్యవస్థను పరిశీలించారు. తాగేందుకు మినరల్ వాటర్ అందిస్తున్నామని వసతి గృహ అధికారులు తెలిపారు. కలెక్టర్ లక్ష్మీశ ఆవరణలోని కిచెన్ గార్డెన్ పరిశీలించి.. గార్డెన్ అభివృద్ధికి అవకాశం ఉన్నందున ఆ దిశగా దృష్టి సారించాలని ఆదేశించారు. పిల్లలు అనారోగ్యం బారిన పడకుండా జాగ్రత్తగా చూడాలని ఆదేశించారు. ఈ మధ్య ఎవరైనా విష జ్వరాలు లేదా డయేరియా బారిన పడ్డారా అని అడిగి తెలుసుకున్నారు. మరుగుదొడ్లతోపాటు మిగిలిన అన్ని వసతులు సరైన విధంగా ఉండేలా చూసుకోవాలని.. పరిశుభ్రతకు ప్రాధాన్యమివ్వాలన్నారు.

పాఠశాలలో అదనపు తరగతి గదులు ప్రారంభం



ప్రజాశక్తి-కంకిపాడు : పి-4 కార్యక్రమంలో భాగస్వాములై అభివృద్ధి పనులు చేపడుతున్న మార్గదర్శిల కృషి అభినందనీయమని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పేర్కొన్నారు. బుధవారం జిల్లా కలెక్టర్ పెనమలూరు నియోజకవర్గంలోని పోరంకి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో దాతల సహకారంతో నిర్మించిన అదనపు తరగతి గదులు, గ్రంథాలయాన్ని పెనమలూరు శాసనసభ్యులు బోడె ప్రసాద్‌తో కలిసి ప్రారంభించారు. సమాజాభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తున్న పెనమలూరు మున్సిపాలిటీ టీడీపీ పార్టీ అధ్యక్షుడు అనుమోలు ప్రభాకరావును సత్కరించి అభినందించారు. విద్యార్థులను ఉద్దేశించి కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యాలను ఏర్పరచుకొని లక్ష్యసాధనకు కృషి చేయాలని ఉద్బోధించారు. అనంతరం జిల్లా కలెక్టర్ మధ్యాహ్న భోజన సమయంలో విద్యార్థులతో కలిసి భుజించారు. ఉయ్యూరు ఆర్డీవో బీఎస్ హేలా షారోన్, తాడిగడప మున్సిపల్ కమిషనర్ నజీర్, పెనమలూరు మండలం తహసీల్దార్ గోపాలకృష్ణ, ఎంపీడీవో ప్రణవి, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సుమలత పాల్గొన్నారు.

జిఎస్‌టి తగ్గింపు విప్లవాత్మక నిర్ణయం : మంత్రి కొల్లు

ప్రజాశక్తి-అవనిగడ్డ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు తీసుకున్న జీఎస్టీ తగ్గింపు విప్లవాత్మక నిర్ణయమని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. బుధవారం అవనిగడ్డ రెవెన్యూ హాలులో సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన మంత్రి రవీంద్ర మాట్లాడుతూ భారతదేశం ప్రపంచాన్ని శాసించే స్థాయికి ఎదుగుతుందన్నారు. జీఎస్టీ తగ్గింపుతో నిత్యావసర సరుకుల ధరలు, వ్యవసాయ పనిముట్ల రేట్లు తగ్గాయి అన్నారు. ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ మాట్లాడుతూ తగ్గిన జీఎస్టీ ప్రకారం ధరల వివరాలు బోర్డులు కచ్చితంగా దుకాణాల ముందు ఏర్పాటు చేయాలని బుద్ధ ప్రసాద్ సూచించారు. నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రాం, రాయపూడి వేణుగోపాల్, ఏఎంసీ చైర్మన్లు కొల్లూరి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

గుర్తు తెలియని మృతదేహం లభ్యం

ప్రజాశక్తి-కోడూరు : పంట కాలువలో గుర్తుతెలియని మృతదేహం లభ్యమైనట్లు కోడూరు ఎస్సై చాణిక్య తెలిపారు. కోడూరు మండల పరిధిలోని వి.కొత్తపాలెం పంట కాలువలో గుర్తు తెలియని మృతదేహాన్ని చూసిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన ప్రాంతానికి పోలీసులు వచ్చి వివరాలు నమోదు చేసుకున్నారు. మృతదేహంపై షర్టు, ఫ్యాంట్ కలిగి ఉన్నాడని, ఎవరైనా గుర్తుపడితే స్థానిక పోలీస్ స్టేషన్ కు సమాచారం అందించాలని ఎస్ఐ తెలిపారు.

మందుగుండు సామాగ్రి నిల్వ ఉంచొద్దు : సిఐ



ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : రాబోవు దీపావళి సందర్భంగా దీపావళి మందు గుండు సామాగ్రిని తయారు చేయువారు, అమ్మేవారు, నిల్వ ఉంచే వారు పోలీస్ యంత్రాంగం సూచించిన జాగ్రత్తలు తప్పకుండా పాటించాలని ఆర్ పేట సిఐ ఏసుబాబు పేర్కొన్నారు. లైసెన్స్ లేకుండా మందుగుండు సామాగ్రిని కలిగి ఉండడం గానీ, అమ్మడం గాని చేయరాదన్నారు. పోలీస్ శాఖ అనుమతి లేకుండా మందు గుండు సామాగ్రిని తయారు చేయరాదన్నారు. మందు గుండు సామాగ్రిని భద్రపరిచే ప్రదేశం / గోడౌన్ లకు లైసెన్స్ కలిగి ఉండవలెనన్నారు. మందు గుండు సామాగ్రిని అనధికారికంగా ఇళ్లల్లో గాని, షాపులలో గాని భద్రపరచరాదన్నారు. లైసెన్స్ తీసుకునే ప్రతి వ్యక్తి తమ షాపులో పనిచేసే ప్రతి ఒక్కరికి ఇన్సూరెన్స్ చేయించవలెనన్నారు. దీపావళి పండుగ ముందు తాత్కాలికంగా మూడు రోజులు లైసెన్స్ పొందు వారు, వారి మందు గుండు సామాగ్రిని లైసెన్స్ కలిగిన గోడౌన్ లలో మాత్రమే భద్రపరచవలెనన్నారు. పై నిబంధనలను ఎవరైనా అతిక్రమించిన ఎడల వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకుడు మృతి



ప్రజాశక్తి-ఉంగుటూరు : మండలం లోని మానికొండకు చెందిన బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ నాయకులు కొండేటి నాగేశ్వరరావు (58) బుధవారం తెల్లవారు జామున గుండెపోటుతో మర ణించారు. గ్రామంలో బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ ఏర్పాటు చేయడంలో నాగేశ్వరరావు కీలకపాత్ర పోషించారు. ఆయన భౌతిక దేహాన్ని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అజ్జీరా వెంకటేశ్వరరావు, మేకల పార్వతీశ్వరరావు, బిల్డింగ్ వర్కర్స్ యూనియన్ అధ్యక్ష కార్యదర్శులు షేక్ నజీర్, ఏసుబాబు తదితరులు సందర్శించి నివాళులర్పించారు.

అద్దె చెల్లించని షాపులు స్వాధీనం

ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : నగరంలోని రాబర్ట్ సన్ పేటలో ఉన్న శ్రీ రంగనాయక స్వామి వారి దేవస్థానానికి చెందిన స్థలంలో 50 సంవత్సరాల నుండి ఎటువంటి అద్దె చెల్లించకుండా ఆక్రమించుకొన్న వ్యక్తుల నుండి సదరు షాపులను బుధవారం ఎండోమెంట్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. ఆంధ్రప్రదేశ్ ఎండోమెంట్ ట్రిబ్యునల్ అమరావతి పెదకాకాని కోర్టు వారి తీర్పు మేరకు సదరు స్థలంలో ఉన్న ఆక్రమణదారులను తొలగించుటకు దేవాదాయ ధర్మాదాయ శాఖ జిల్లా సహాయ కమిషనర్ నూతక్కి వెంకట సాంబశివరావు, తనిఖీ అధికారి కగ్గ శ్రీనివాసరావు, మచిలీపట్నం భద్రాద్రి శ్రీరాములు వారి దేవస్థానం కార్యనిర్వహణ అధికారి జె శిరీష ఇతర దేవాలయ సిబ్బంది, పోలీసు సిబ్బంది ఆధ్వర్యంలో దేవాలయంకు చెందిన స్థలంలోని రెండు షాపులను స్వాధీనం చేసుకున్నట్లు దేవాలయ కార్యనిర్వహణాధికారి మాగపాటి సత్య ప్రసాద్ బాబు తెలిపారు.



షాపును స్వాధీనం చేసుకున్న ఎండోమెంట్ అధికారులు

సిజెఐపై దాడిని ఖండిస్తూ నిరసనలు

ప్రజాశక్తి-వీరులపాడు :ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం జుజ్జూరు మండల కేంద్రంలో సిపిఎం, సిఐటియు, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో సుప్రీం కోర్టు ప్రధాన న్యాయమూర్తిపై మతోన్మాదుల దాడిని ఖండిస్తూ గ్రామంలో నిరసన ప్రదర్శన చేశారు. దాడి చేసిన నిందితుడిని వెంటనే శిక్షించాలని, భారత రాజ్యాంగాన్ని కాపాడాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కోట కళ్యాణం, సిపిఎం మండల కార్యదర్శి చాట్ల రవి, నాయకులు నాగభూషణం, నరసయ్య, రాజేష్ తదితరులు పాల్గొన్నారు



వీరులపాడులో నిరసన ర్యాలీ



కంచికచర్లలో నిరసన ప్రదర్శన

ప్రజాశక్తి-కంచికచర్ల : సిజెఐ గవాయిపై జరిగిన దాడిని ఖండిస్తూ కంచికచర్లలో ప్రజా సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో బుధవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి వ్యవసాయ కార్మిక సంఘం ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కోట కళ్యాణ్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు సాక్షిగా సిజెఐపై దాడి చేయడమంటే భారత ప్రజాస్వామ్యంపై దాడి చేయడమేనని తెలిపారు. ఇది దేశ ప్రజాస్వామ్యానికే ముప్పని, ప్రజాతంత్ర వాదులు ఇలాంటి ఘటనలను తీవ్రంగా ఖండించాలన్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షులు భూషణం, ఎస్ఎఫ్ఐ నాయకులు గోపి నాయక్, పంచాయతీ కార్మికులు సుధాకర్, మల్లేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.



పెనుగంచిప్రోలుకు ఉత్తమ పంచాయతీగా అవార్డు

ప్రజాశక్తి-వత్సవాయి : ఎన్టీఆర్ జిల్లాలో పెనుగంచిప్రోలును అత్యుత్తమ గ్రామ పంచాయతీగా రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించింది. విజయవాడలో జరిగిన స్వచ్ఛాంధ్ర అవార్డుల ప్రదానోత్సవంలో ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మి షా చేతుల మీదుగా పెనుగంచిప్రోలు సర్పంచ్ వేల్పుల పద్మ కుమారి అత్యంత ఉత్తమ ప్రతిభా అవార్డు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో నందిగామ ఆర్‌డిఓ బాలకష్ణ, జిల్లా పంచాయతీ అధికారిణి లావణ్య, పెనుగంచిప్రోలు గ్రామ పంచాయతీ కార్యదర్శి గొర్రెపాటి శ్యాం కుమార్ పాల్గొన్నారు. సర్పంచ్ పద్మ కుమారి మాట్లాడుతూ ఈ అవార్డును పెనుగంచిప్రోలు గ్రామ ప్రజలకు అంకితం చేస్తున్నట్లు తెలిపారు.

11 నుండి ఎంబివికె కంప్యూటర్ శిక్షణ నూతన బ్యాచ్లు ప్రారంభం

విజయవాడ : మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రం (ఎంబివికె) కంప్యూటర్ శిక్షణా విభాగం ఆధ్వర్యాన నిర్వహిస్తున్న శిక్షణా తరగతుల నూతన బ్యాచ్‌లను ఈనెల 11వ తేదీ నుండి ప్రారంభించనున్నట్లు ఆ విభాగం బాధ్యులు టి.క్రాంతికిరణ్ బుధవరం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంఎస్ ఆఫీస్ విత్ ఎఐ, ఫొటోషాప్, ట్యాలీ కోర్సులకు నూతన బ్యాచ్‌లను ప్రారంభమవుతాయని తెలిపారు. ఆసక్తిగల వారు 9014541958, 9490098042 సెల్ నెంబర్లలోగానీ, గవర్నరుపేట రాఘవయ్యపార్కు సమీపంలోని మాకినేని బసవపున్నయ్య విజ్ఞాన కేంద్రంలో నేరుగాగానీ సంప్రదించాలని కోరారు.



ఘనంగా దేవీప్రసాద్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : అఖిల భారత మాల సంఘాల జెఎసి చైర్మన్, ఆదాయ పన్ను రిటైర్డు కమిషనర్ డాక్టర్ ఉప్పులేటి దేవీప్రసాద్ పుట్టిన రోజు వేడకలు బుధవారం ఘనంగా జరిగాయి. విజయవాడ గురునానక్ నగర్‌లోని పార్టీ కార్యాలయంలో పుట్టిన రోజు వేడుకలను వందలాది మంది పార్టీ కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు. అనంతరం దేవీప్రసాద్‌ను సన్మానించారు. ఈ సందర్భంగా దేవీప్రసాద్ మాట్లాడుతూ పార్టీని గ్రామ స్థాయి వరకు అభివద్ధి చేయాలని కోరారు. ఈసమావేశంలో అఖిల భారత మాల సంఘాలు, దళిత సంఘాల నాయకులతోపాటు ఇండియన్ అంబేద్కర్ సొసైటీ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఉప్పులేటి తారకప్రసాద్, టి.వెంకటేష్, యు.ఎ.నేతాజీ తదితరులు పాల్గొని ఆయనకు జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు.

క్రీడా పోటీలకు ఎంపికలు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: పట్టణంలోని బాలుర ఉన్నత పాఠశాలలో బుధవారం మండల విద్యాశాఖ అధికారి ఎల్ చిట్టిబాబు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు పివి నాగేశ్వరరావు ఆధ్వర్యంలో మండల స్థాయి క్రీడా పోటీలకు బుధవారం ఎంపికలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఈ పోటీలలో 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వాలీబాల్, చెస్, యోగ, బాల్ బ్యాట్మెంటన్ వంటి క్రీడలకు ఎంపికలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల కోఆర్డినేటర్ ఎం నాగేశ్వరరావు, ఉపాధ్యాయులు ఎం శ్రీనివాసరావు, శారద, కుమారి, సునీత, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



అవార్డ్ గ్రహీతకు సన్మానం

ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: స్వచ్ఛ ఆంధ్రాలో భాగంగా టెర్రస్ గార్డెనింగ్‌లో జిల్లా అవార్డ్‌ను కొండపల్లి మునిసిపాలిటీ మెప్మా విభాగానికి చెందిన లక్ష్మీ స్వయం సహాయక సంఘం సభ్యురాలు ఎస్ విజయలక్ష్మి మంగళవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జిల్లా కలెక్టర్ చేతుల మీదుగా అందుకున్నారు. అవార్డు గ్రహీతను బుధవారం మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు సన్మానించారు. ప్రతి సమాఖ్యలోని సభ్యురాలు ఆమెను ఆదర్శంగా తీసుకోవాలని తెలిపారు.



కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు స్థల పరిశీలన

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ మండలం రాఘవపురం గ్రామంలో కేంద్రీయ విశ్వవిద్యాలయం ఏర్పాటుకు సంబంధించి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య బుధవారం అధికారులతో కలిసి స్థలాలను పరిశీలించారు. రాఘవపురం గ్రామం చుట్టుపక్కల ఉన్న భూములు ఈ ప్రాజెక్టుకు సరిపోతాయని ప్రాథమిక అంచనా వేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ కృష్ణకుమారి, నందిగామ ఆర్డీవో బాలకష్ణ, తహశీల్దారు సురేష్, మున్సిపల్ కమిషనర్, స్థానిక అధికారులు మరియు కూటమి నాయకులు పాల్గొన్నారు.


సిఐటియు జిల్లా మహాసభను జయప్రదం చేయాలి

ప్రజాశక్తి- నందిగామ : ఈ నెల తేదీల్లో 12, 13 తేదీలలో కొండపల్లిలో జరిగే సిఐటియు ఎన్టీఆర్ జిల్లా 12వ మహాసభలను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్‌సి హెచ్ శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. బుధవారం సిఐటియు కార్యాలయంలో మహాసభల పోస్టర్లను ఆయన విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎన్‌సిహెచ్ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఉద్యోగ, కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సిఐటియు నిత్యం పోరాటాలు నిర్వహిస్తుందని తెలిపారు. స్కీమ్ వర్కర్లు, ఇతర అసంఘటిత కార్మికులు, ఉద్యోగుల సమస్యల పరిష్కారం కోసం వారు చేస్తున్న ఆందోళనలకు అండగా నిలుస్తున్నదని తెలిపారు. ఈ నేపథ్యంలో అక్టోబర్ 12, 13 తేదీల్లో కొండపల్లిలో జరిగే సిఐటియు ఎన్టీఆర్ జిల్లా 12వ మహాసభ విజయవంతం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నందిగామ మండల కార్యదర్శి కె.గోపాల్, అధ్యక్షులు సుశీల, కొల్లి సరళ, తిరుమలదేవి, దాసవరపు సైదా, బి.లాజర్, తదితరులు పాల్గొన్నారు.



నిబంధనలకు విరుద్ధంగా బెల్ట్ షాపులకు మద్యం సరఫరా

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ ఎక్సైజ్ సర్కిల్ పరిధిలోని 17 వైన్ షాపుల యాజమానులు ఆయా పార్టీలు మండల పరిధిలో బెల్ట్ షాపులకు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి మద్యం సరఫరా చేస్తున్నారు. దీనికిగాను అనాధికార రసీదులు ఇస్తున్నారు. ఈ రసీదు ఈ ఏడాది ఆగస్టు నెలకు సంబంధించినది. రసీదుపైన నందిగామ రూరల్ సిండికేట్ అని రాసి ఉంది. గత పదిహేను నెలలుగా వైన్ షాపుల యాజమానులు ప్రభుత్వ నిబంధనలను తుంగలో తొక్కి వీధి వీధికి మద్యం సరఫరా చేస్తున్నా నందిగామ ఎక్సైజ్ అధికారులు పట్టించుకోవడంలేదనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పుడు నకిలీ మద్యం మూలాలు నందిగామ నియోజకవర్గంలో కూడా వెలుగు చూస్తుండటంతో గ్రామీణ ప్రాంతాల్లో వైన్ షాపుల యాజమానులు నకిలీ మద్యం సరఫరా చేశారేమోనన్న అనుమానం వ్యక్తమవుతోంది. బెల్ట్ షాపులకు ఏఏ వైన్ షాపుల యాజమానులు మద్యం సరఫరా చేస్తున్నారో వారిపై చర్యలు తీసుకోవాలని, ఆ వైన్ షాపులు సీజ్ చేయాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు.


నందిగామ రూరల్ సిండికేట్
నందిగామ
మహారాజ శ్రీ
గ్రామము
మీరు మాకు ఇవ్వ
ఈ రోజున అక్షరాల రూపాయలు Five Thousand Rupees only
ఇచ్చినారు గాన ముట్టినవి. మీ ఖాతాను జమ వ్రాయించగ
Rs. 5000/-
సొమ్ము యిచ్చినవారి సంతకం

క్రీడా విజేతలకు ప్రోత్సాహకాలు అందజేత

ప్రజాశక్తి-గంపలగూడెం: ఇటీవల గంపలగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సిజిఎఫ్ క్రీడల్లో భాగంగా, విజేతలకు బుధవారం ప్రోత్సాహకాలను అందజేసినట్లు పిడి రాంబాబు తెలిపారు. ఈ కార్యక్రమానికి సర్పంచ్ కోట పుల్లమ్మ తదితరులు పాల్గొని క్రీడాకారులకు అందజేసినట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు చెరుకూరి రాజేశ్వరరావు, రేగళ్ల వీరారెడ్డి, డివి కష్ణారావు, వేముల బాలయ్య, పూర్వ వ్యాయామ ఉపాధ్యాయులు గుర్రం గోపాలరావు, ఎంఈఓ పివిడిఎల్ నరసింహారావు, తదితరులు పాల్గొన్నారు.

దురలవాట్లకు విద్యార్థులను దూరంగా ఉంచాలి

ప్రజాశక్తి - తిరువూరు : విద్యార్థి దశలోనే ఎటువంటి దురలవాట్లకు లోనుకాకుండా విద్యార్థులను నిరంతర పరిశీలన ద్వారా ఉపాధ్యాయులు నియంత్రించవచ్చని ఎన్టీఆర్ జిల్లా ఈగల్ టీమ్ సబ్ ఇన్స్పెక్టర్ ఎం. వీరాంజనేయులు, పి.రాంబాబు అన్నారు. తిరువూరు వాహిని ఇంజినీరింగ్ కాలేజీలో ఉపాధ్యాయులకు జరుగుతున్న ఇండక్షన్ ట్రైనింగ్‌ను బుధవారం వారు సందర్శించి శిక్షణ పొందుతున్న ఉపాధ్యాయులతో మాట్లాడారు. మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాలను, వ్యక్తుల సామాజిక, ఆర్థిక, శారీరక పరిస్థితులపై మత్తు పదార్థాలు చూపించే దుష్ప్రభావాలగురించి వివరించారు.

రోడ్ల అభివృద్ధికి నిధులు మంజూరు

ప్రజాశక్తి-జగ్గయ్యపేట: జగ్గయ్యపేట నియోజకవర్గ అభివద్ధి దిశగా మరో కీలక అడుగు పడింది. రాష్ట్ర ప్రభుత్వం రోడ్లు భవనాల శాఖ ద్వారా మొత్తం రూ.7.50 కోట్ల నిధులతో రెండు ప్రధాన రహదారులకు నిధులు మంజూరు చేసింది. ప్రజల అభివద్ధి, రవాణా సౌకర్యం కోసం ఆయన చేసిన ప్రతిపాదనలను రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించి జగ్గయ్యపేట-షేర్ మహమ్మద్ పేట రోడ్డు, చిలకల్లు-వేదాద్రి- బండిపాలెం-కొనకంచి రోడ్డు (జగ్గయ్యపేట -వేదాద్రి రోడ్డు)కు నిధులు మంజూరు చేసింది. ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) నిరంతర కషి వల్లే నిధులు మంజూరయ్యాయని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నియోజకవర్గంలోని ప్రతి గ్రామం సౌకర్యవంతమైన రోడ్లతో కలిసేలా కృషి చేస్తానని తెలిపారు.

నందిగామ మున్సిపాలిటీకి స్వచ్ఛత అవార్డులు

ప్రజాశక్తి- నందిగామ : నందిగామ మున్సిపాలిటీకి ఉత్తమ స్వచ్ఛ మున్సిపాలిటీ అవార్డు లభించింది. ఈ సందర్భంగా నందిగామ మున్సిపల్ కమిషనర్ లోవరాజు బుధవారం మున్సిపల్ చైర్‌పర్సన్ మండవ కష్ణకుమారితో కలిసి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యను ఆమె కార్యాలయంలో బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సౌమ్య మాట్లాడుతూ.. ప్రజల సహకారం, మున్సిపల్ సిబ్బంది కష్టం వల్లే ఈ అవార్డు సాధ్యమైందని తెలిపారు. నందిగామ మున్సిపాలిటీకి "స్వచ్ఛ ఎస్-ఎల్ఎఫ్ ఆంధ్ర మహిళ నందిగామ" అవార్డు లభించింది. ఈ సందర్భంగా నందిగామ మున్సిపల్ కమిషనర్, మెప్మా సిఎంఎం నిర్మల ఎమ్మెల్యే తంగిరాల సౌమ్యను కలిసి అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. నందిగామను రాష్ట్రంలో ఆదర్శ మున్సిపాలిటీగా తీర్చిదిద్దాలని తెలిపారు.



చేపల సాగుతో రైతులకు అదనపు ఆదాయం : కలెక్టర్


సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్‌కు విన్నవిస్తున్న మహిళలు

ప్రజాశక్తి-మొవ్వ వ్యవసాయంతో పాటు అనుబంధంగా కొరమీను చేపల సాగుతో రైతులు అదనపు ఆదాయం పొందవచ్చని, సాగుకు ప్రభుత్వం అందించే ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ రైతులను కోరారు. బుధవారం మొవ్వ మండల పరిధిలోని చినముత్తేవి గ్రామంలో రామ్ ఫౌండేషన్, ఉదయ్ ఆక్వా యూనిట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పాల్గొని పెంపకం యూనిట్ ని పరిశీలించారు. గ్రామానికి చెందిన చిత్తూరి కస్తూరిబాయి పది సెంట్ల స్థలంలో చేపట్టిన కొరమేను సాగును పరిశీలించారు. ట్యాంకులోని చేప పిల్లలను ఆసక్తిగా పరిశీలించి సాగుకు సంబంధించిన వివరాలను ఆమెను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన గ్రామంలో ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ ప్రతి ఇంటి నుంచి ఓ పారిశ్రామికవేత్తను తయారు చేసే లక్ష్యంలో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం జీవనోపాదులను మెరుగుపరిచే వివిధ కార్యక్రమాలను చేపడుతోందన్నారు. దీనిలో భాగంగా కొరమీను చేపల సాగును చేపట్టేందుకు రుణాలను అందించి ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సాహం అందిస్తోందన్నారు. ఎకరం లేదా రెండు ఎకరాలు కలిగిన రైతులు 10 సెంట్ల స్థలంలో చెరువును తవ్వుకొని సాగు చేపట్టేందుకు ప్రభుత్వం అన్ని విధాల ప్రోత్సాహం అందిస్తుందని తెలిపారు. ప్రధానమంత్రి ఎంప్లాయిమెంట్ జనరేషన్ ప్రోగ్రామ్ కింద రూ.4.40 లక్షల రుణాన్ని అందించడంతోపాటు 35 శాతం సబ్సిడీ రాయితీలను అందిస్తుందన్నారు. ఈ సమావేశంలో డిఆర్డిఏ పిడి హరిహరనాథ్, మొవ్వ మండల తహసిల్దారు మస్తాన్, ఎంపీడీవో దయ్యాల సుహాసిని, మొవ్వ ఎంపీపీ కొండేటి ఇందిరా, గ్రామ సర్పంచ్ కొమ్ము సౌదామణి పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి

మొవ్వ మండలంలో చినముత్తేవి గ్రామానికి బుధవారం విచ్చేసిన కలెక్టర్ డీకే బాలాజీ కి చినముత్తెవి గ్రామస్తులు పలు సమస్యలను పరిష్కరించాలని వినతి పత్రం అందించారు. గ్రామంలో గత ఆరు సంవత్సరాలు నుండి ఇండ్ల స్థలాలు లేక ఒకే ఇంట్లో రెండు మూడు కాపురాలు చేస్తూ , అద్దె ఇంట్లో ఉంటూ ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్నామని తెలిపారు. ఇళ్ల స్థలాలు కేటాయించి ఇల్లు నిర్మించాలని కోరారు. అలాగే గ్రామంలో అయినంపూడి డ్రైనేజీపై శిథిలమైన వంతెన నిర్మాణం వెంటనే చేపట్టి ఆర్టీసీ బస్సు సౌకర్యం ఏర్పాటు చేయాలని, గ్రామంలో అంతర్గత రోడ్ల నిర్మాణానికి బడ్జెట్ కేటాయించాలని కోరారు. సిపిఎం గ్రామ శాఖ కార్యదర్శి మాదాసు నాగులు, సభ్యులు నాగమణి, వెంకటలక్ష్మి, గ్రామస్తులు పాల్గొన్నారు.



వెంకన్నను దర్శించుకున్న కేంద్ర మంత్రి శ్రీనివాసవర్మ

ప్రజాశక్తి-గుడ్లవల్లేరు : మండలంలోని డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారిని కేంద్ర భారీ ఉక్కు పరిశ్రమల శాఖ సహాయ మంత్రి శ్రీనివాసవర్మ బుధవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి సన్మానించి స్వామివారి చిత్ర పటంతో పాటు ప్రసాదాలను అందించి ప్రత్యేక పూజలను చేశారు.

శ్రీ వెంకటేశ్వరునికి గరుడ సేవ : డోకిపర్రు భూ సమేత శ్రీ వెంకటేశ్వర స్వామివారికి పౌర్ణమిని పురస్కరించుకుని గరుడ సేవను చేపట్టారు. స్వామివారిని ప్రధాన వీధుల వెంబడి ఊరేగించారు. అడుగడుగునా మహిళా భక్తులు స్వామివారికి పండ్లు, టెంకాయలను సమర్పించి హారతులిచ్చి బ్రహ్మారథం పట్టారు. ఈ కార్యక్రమాన్ని మెయిల్ మేనేజింగ్ డైరెక్టర్ పురిటిపాటి వెంకట కృష్ణారెడ్డి, సుధారెడ్డి ఆధ్వర్యంలో నిర్వాహకులు చేపట్టారు.

గ్రామసింహాల స్వైర విహారం

ప్రజాశక్తి -నందివాడ : గ్రామాన్ని రక్షించే గ్రామ సింహాలు ఇప్పుడు ప్రజల పాలిట మత్స్య సింహాలుగా మారుతున్నాయి . విశ్వాసానికి కేరాఫ్ అడ్రస్‌గా నిలిచే కుక్కలు ఇప్పుడు దాడులు చేస్తున్నాయి. నందివాడ మండల పరిధిలో 23 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. ప్రతి గ్రామంలో సుమారు 100 నుండి 150 వీధి కుక్కలు ఉంటాయి. గ్రామాల్లో స్వేచ్ఛగా స్వైర విహారం చేస్తూ, కనబడిన వారిపై దాడి చేస్తున్నాయి. దీంతో ప్రజలకు కంటి మీద కనుకు లేకుండా పోయింది.

కుక్కల దెబ్బకు ఇంటి నుంచి అడుగు బయట పెట్టాలంటే జనం జంకుతున్నారు. మండలం లోని పలు గ్రామాల్లో వీధి దీపాలు సరిగ్గా లేకపోవడంతో కుక్కలు గుంపులు గుంపులుగా సేద తీరుతున్నాయి.


రోడ్డుపై సంచరిస్తున్న కుక్కలు

పనుల నిమిత్తం ఇతర ప్రాంతాలకు వెళ్లే వారిపై కుక్కలు దాడికి పాల్పడు తున్నాయి. దాంతో రాత్రిళ్ల ప్రయాణించా లంటే ప్రాణాలను అరచేతిలో పెట్టుకొని ప్రయాణించాల్సి వస్తోంది.

రోడ్డుపై భయంగా ప్రయాణించాల్సి వస్తోంది
మసిముక్కు వేణుగోపాలరావు, మాజీ సర్పంచ్, కుదరవల్లి



కుదరవల్లి గ్రామంలో కుక్కలు లెక్కలేనన్ని ఉన్నాయి. రోడ్లపై ప్రయాణం చేసే ద్విచక్ర వాహనదా రులను కరుస్తున్నాయి. చిన్న పెద్ద అని తారతమ్యం లేకుండా కనిపించిన వారందరి మీదకి ఎగబడు తున్నాయి. ఇటువైపుగా ప్రయాణించాలంటే జనమంతా భయం గుప్పెట్లో పయనించాల్సి వస్తుంది.

కుక్కల బెడద నుంచి కాపాడాలి
బొడ్డుపల్లి కిరణ్ బాబు, లక్ష్మీనరసింహపురం



మండల వ్యాప్తంగా కుక్కల దాడిలో పలు చోట్ల స్కూల్‌కి వెళ్లే పిల్లలపై దాడులు చేయడం వలన స్కూల్‌కి వెళ్లాలంటే బెంబేలెత్తుతున్నారు. పిల్లల తల్లిదండ్రులు తమ పిల్లల్ని ఒంటరిగా స్కూల్‌కి పంపా లంటే భయపడిపోతున్నారు. అధికారులు స్పందించి వెం టనే చర్యలు తీసుకొని కుక్కల బెడద నుండి రక్షించాలి.

నేడు కెయు ఇంజినీరింగ్ కళాశాలలో క్రీడల పండుగ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : కృష్ణా విశ్వవిద్యాలయం ఇంజనీరింగ్ కళాశాలలో ఈ నెల తొమ్మిదవ తేదీన క్రీడల పండుగ నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయకుమారి తెలిపారు. పురుషులకు, మహిళలకు వాలీబాల్, టేబుల్ టెన్నిస్, చెస్ పోటీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా 10వ తేదీన సాంస్కృతిక కార్యక్రమాలు పండుగ ఉంటుందన్నారు. సోలో, గ్రూప్‌ల వారిగా పాటల పోటీ, డ్యాన్స్ పోటీ, స్కిట్స్, ఫ్లాష్ మాబ్ పోటీలు ఉంటాయని ఆమె తెలిపారు.

బండారుగూడెంలో డ్రైనేజీలు లేక ఇబ్బందులు

ప్రజాశక్తి-ఉంగుటూరు : బాపులపాడు మండలం: బండారుగూడెం గ్రామంలో బుధవారం సాయంత్రం కురిసిన భారీ వర్షంతో రోడ్లపై వరద నీరు నిలిచిపోవడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. గ్రామంలో డ్రైనేజీ వ్యవస్థ సరిగ్గా లేకపోవడం వలన వర్షం వచ్చిన ప్రతిసారీ ప్రజలు ఇబ్బందులుపడుతున్నారని సిపిఎం నాయకుడు బర్రె లెనిన్ అన్నారు. ఈ సమస్యను పరిష్కరించాలని పలుమార్లు పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకు


రోడ్డుపై నిలబడిన వర్షపు నీరు

వెళ్లినప్పటికీ, ఎటువంటి చర్యలు చేపట్టడంలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు గ్రామంలో డ్రైనేజీ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని కోరారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి సన్నిధిలో మంత్రి కొల్లు

ప్రజాశక్తి-మోపిదేవి : మోపిదేవి గ్రామంలోని ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన శ్రీవల్లీ దేవసేన సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానాన్ని రాష్ట్ర ఎక్సైజ్ శాఖ, గనులు, భూగర్భ శాస్త్ర శాఖ మంత్రి కొల్లు రవీంద్ర బుధవారం దర్శించుకున్నారు. దేవస్థానానికి విచ్చేసిన మంత్రికి ఆలయ సూపర్డెంట్ అచ్యుత మధుసూదన్ రావు, ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం మంత్రి ఆలయ ఆవరణలో గల నాగపుట్టలో పాలు పోసి మొక్కుబడులు చెల్లించుకుని, శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారిని దర్శించుకున్నారు.

సుబ్రహ్మణ్యేశ్వర స్వామి వారి దేవస్థానంలో మినిమం టైమ్ స్కేల్‌పై విధులు నిర్వర్తిస్తున్న సిబ్బంది తమ సమస్యలను పరిష్కరించి ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలని ఈసందర్భంగా మంత్రి కొల్లుకు వినతిపత్రం అందించారు.



సిజెఐపై దాడికి ఖండన

ప్రజాశక్తి-కంకిపాడు : సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ బిఆర్ గవా య్‌పై జరిగిన దాడి ముమ్మాటికి రాజ్యాంగంపై జరిగిన దాడిగా భావిస్తున్నట్లు, దాడి చేసిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని మాల మహానాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు గోగులమూడి రాజు ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. న్యాయ వ్యవస పై మతపరమైన దాడులు జరగటం ప్రమాదకర మని, మతం పేరుతో దేశ న్యాయ వ్యవస్థపైన దాడులు చేయడం నేరమన్నారు. ఇలాంటివి పునరావతం కాకుండా కేంద్రం చర్యలు తీసుకోవాలన్నారు.


వెబ్‌సైట్‌ను ఆవిష్కరిస్తున్న సిఎం చంద్రబాబు నాయుడు

'ప్రెస్ క్లబ్ ఆఫ్ అమరావతి' వెబ్‌సైట్ ఆవిష్కరించిన సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో : అమరావతి జర్నలిస్టులు రూపొందించిన 'ప్రెస్ క్లబ్ ఆఫ్ అమరావతి' వెబ్‌సైట్‌ను ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బుధవారం సచివాలయంలో ఆవిష్కరించారు. ఈసందర్భంగా అమరావతి ప్రెస్‌క్లబ్ కమిటీకి, జర్నలిస్టులకు ముఖ్యమంత్రి శుభాకాంక్షలు తెలిపారు. రాజధాని ప్రాంతంలోని జర్నలిస్టులు అంతా కలిసి ప్రెస్ క్లబ్ ఆఫ్ అమరావతి ఏర్పాటు చేసుకోవడంతోపాటు నేడు వెబ్ సైట్‌ను రూపొందించుకోవడాన్ని ముఖ్యమంత్రి అభినందించారు. ప్రెస్ క్లబ్ నిర్మాణానికి అవసరమైన స్థలం కేటాయించాలని ఈ సందర్భంగా కమిటీ సభ్యులు, జర్నలిస్టులు ముఖ్యమంత్రిని కోరగా...ఆయన సానుకూలంగా స్పందించారు. రాజధానిలో మీడియా అవసరాలు తీర్చడానికి సహాయ సహకారాలు అందిస్తామని ముఖ్యమంత్రి హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ అప్పాజీ, జనరల్ సెక్రటరీ సతీష్ బాబు, వైస్ ప్రెసిడెంట్ నారాయణ, ట్రెజరర్ కె.పూర్ణచంద్ర రావు, జాయింట్ సెక్రటరీ మహేష్, కమిటీ సభ్యులు శ్యామ్ సుందర్, మల్లేశ్వరరావు, శ్రీనివాస్, కె.గాంధీబాబు, అనిల్ పాల్గొన్నారు.

తెలుగు భాషా కీర్తి కిరీటం ఎంవి కష్ణారావు : మంత్రి

ప్రజాశక్తి-అవనిగడ్డ : తెలుగు భాషకు కీర్తి కిరీటం మండలి వెంకటకృష్ణారావు అని రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర కొనియాడారు. బుధవారం అవనిగడ్డ వంతెన సెంటర్లో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి కీర్తిశేషులు మండల వెంకటకృష్ణారావు శతజయంతి సందర్భంగా మండలి విగ్రహానికి మంత్రి రవీంద్ర పూలదండలు వేసి నివాళులర్పించారు. అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్, నియోజకవర్గ యువ నాయకులు మండలి వెంకట్రాం, ఏఎంసీ చైర్మన్ కొల్లూరు వెంకటేశ్వరరావు కూటమి నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండల వెంకటకష్ణారావు శత జయంతి కమిటీ ,గాంధీ క్షేత్రం, మండలి అభిమానులు ఆధ్వర్యంలో ప్రతిరోజు నిర్వహించే కార్యక్రమంలో భాగంగా బుధవారం మోపిదేవి మండలానికి చెందిన టిడిపి నాయకులు వెంకట కృష్ణారావు విగ్రహానికి పూలదండలు వేసి నివాళులర్పించారు. మోపిదేవి టిడిపి మండల పార్టీ అధ్యక్షులు నడకుదుటి జనార్దన్ రావు కూటమి నాయకులు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-కోడూరు :** దివంగత నేత మాజీ మంత్రి మండలి వెంకట కష్ణారావు శత జయంతి వేడుకల్లో భాగంగా కోడూరు ప్రధాన సెంటర్లోని వెంకటకష్ణారావు విగ్రహానికి కోడూరు మండలం జనసేన పార్టీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళులర్పించారు. బుధవారం జరిగిన ఈ కార్యక్ర మానికి విశ్వనాథపల్లి గ్రామానికి చెందిన నాయకులు విశ్వనాథపల్లి నాయకులు తోట రాంబాబు, కోడూరు మండలం కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఫెన్సింగ్ పోటీల్లో కెయు విద్యార్థి ప్రతిభ

ప్రజాశక్తి-మచిలీపట్నం రూరల్ : ఫెన్సింగ్ క్రీడలో బంగారు పతకం సాధించిన అలోషి యాస్‌ను కృష్ణా విశ్వ విద్యాలయం ఉప కులపతి ఆచార్య కె రాంజీ అభి నందిం చారు. మైలవరం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జరిగిన కృష్ణా విశ్వ విద్యాలయం అంతర్ కళాశాలల ఫెన్సింగ్ టోర్నమెంట్ లో విశ్వవిద్యాలయ బిఫార్మసీ విద్యార్థి అలోషియాస్ బంగారు పతకం సాధించాడు. ఈ సందర్భంగా ఉపకులపతి ఆచార్య కె రాంజీ అభినందించి విశ్వవిద్యాలయం మద్దతు గా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. నవంబర్ 6 నుండి అమతసర్‌లోని గురునానక్ విశ్వవిద్యాలయంలో జరిగే టోర్నమెంట్ లో పాల్గొనబోతున్నట్లు అలోషియాస్ తెలిపారు. ఈ కార్యక్రమం లో ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాంబాబు, ఫిజికల్ డైరెక్టర్ గోపి లు పాల్గొన్నారు. **ప్రజాశక్తి-ఉంగుటూరు (గన్నవరం) :** ఈనెల 7వ తేదీన విజయవాడ జిల్లాలోని మైలవరంలో జరిగిన కృష్ణ యూనివర్సిటీ ఫెన్సింగ్ పోటీలలో తమ విద్యార్థిని పి కీర్తిశ్రీ (ఐబిఎస్సి) వెండి పతకాన్ని సాధించడం గర్వకారణమని గన్నవరం వీకేఆర్ కళాశాల ఫ్రిన్స్ పాల్ డి శ్రీనివాసరావు అన్నారు. బుదవారం కళాశాలలో ప్రిన్సిపాల్ డి. శ్రీనివాసరావుతో పాటు అధ్యాపకులు, సిబ్బంది కీర్తిశ్రీకి అభినందనలు తెలియజేశారు.

జిఎస్‌టి తగ్గినా.. పాత ధరలే అమలు

• గంపలగూడెంలో అమలుకాని సంస్కరణలు



ప్రజాశక్తి-గంపలగూడెం: సామాన్యులకు ఊరటనిచ్చేలా కేంద్ర ప్రభుత్వం చాలా వస్తువులపై, నిత్యావసర సరుకులపై జిఎస్‌టిని తగ్గించినా.. వ్యాపారులు మాత్రం దోపిడీ ఆపడం లేదు. చాలా మంది వినియోగదారులకు జిఎస్‌టి తగ్గిన విషయం పెద్దగా తెలియకపోవడంతో పాత ధరకే వస్తువులను విక్రయిస్తున్నారు. వినియోగదారులపై భారాలను మోపుతున్నారు. ప్రభుత్వం మాత్రం జిఎస్‌టి తగ్గింపుపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నామంటూ ప్రకటనలకే పరిమితమవుతోంది. కానీ నిబంధనలు ఉల్లంఘిస్తున్న వ్యాపారులపై మాత్రం చర్యలు తీసుకోవడంలేదు. ప్రభుత్వం జిఎస్‌టి శ్లాబ్‌ను తగ్గించిన మందులు, ఫ్యాన్సీ, సెల్ఫోన్, ఎలక్ట్రానిక్, బంగారం, వెండి, ఫర్నిచర్, వస్త్రాలు తదితర వస్తువులు, సేవలు వంటి వాటి వివరాలు ప్రకటించింది. వీటి ధరలు వ్యాపారులు కచ్చితంగా తగ్గించాల్సి ఉంది. పన్నీరు, టెట్రాప్యాక్ పాలు, చపాతీలు, రోటీలపై గతంలో ఐదు శాతం జిఎస్‌టి ఉండేది. దానిని పూర్తిగా ఎత్తేశారు. దీంతో ఆయా వస్తువుల ధరలు తగ్గాల్సి ఉన్నా.. పాత రేటుకే వ్యాపారులు విక్రయిస్తున్నారు. ప్రధాని మోడీ స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో ప్రకటించిన విధంగా జిఎస్‌టి శ్లాబులు 12 శాతం 28 శాతం తొలగించి, మెజారిటీ వస్తు సేవలకు ఐదు శాతం, 18 శాతం మాత్రమే వర్తింపజేశారు. బట్టర్, డ్రై ఫ్రూట్స్, కండెన్స్, మిల్క్ ఐస్ క్రీమ్, పాస్ట్రీ, బిస్కెట్లు, ఫ్రూట్ జ్యూస్, షాంపూ టాల్కం పౌడర్, టూత్ పేస్ట్, టూత్ బ్రష్, ఫేస్ పౌడర్, సబ్బులు, హెయిర్ ఆయిల్ ధరలపై జిఎస్‌టి గతంలో 12 శాతం ఉండేది. ప్రస్తుతం 5 శాతం వసూలు చేయాలి. విద్యార్థులు ఉపయోగించే పుస్తకాలు, పెన్సిళ్లు, ఎరేజర్లు, షార్ప్‌నర్‌లపై జిఎస్‌టి 12 శాతం నుంచి ఐదు శాతానికి తగ్గింది. అరుదైన వ్యాధులకు సంబంధించిన మందులపై పూర్తిగా జిఎస్‌టి ఎత్తేశారు. యునాని, సిద్ధ, హెూమియోపతి సహా అన్ని మందులు, ఆక్సిజన్ కిట్లు, రసాయనాలు, గ్లూకోమీటరు, సర్జికల్ వస్తువులపై 12 శాతం ఉంటే 5 శాతానికి పరిమితం చేశారు. థర్మామీటరుపై 18 శాతం ఉండే జీఎస్టీని 5 శాతానికి తగ్గించేశారు. సిమెంట్‌పై జీఎస్టీ 28 శాతం ఉంటే 18 శాతానికి పరిమితం చేశారు. మిగిలిన గహ నిర్మాణ వస్తువులపై 12 శాతం ఉంటే 5 శాతానికి కుదించారు. టీవీలు, ప్రొజెక్టర్లు, ఏసీలు, డిషల్ వాషర్లపై గతంలో 28 శాతం ఉంటే దానిని 18 శాతానికి తగ్గించారు. ఈ మార్పులు సెప్టెంబర్ 22వ తేదీ నుండి అమల్లోకి రాగా.. ఈ మార్పులకు గంపలగూడెం మండలం ప్రజలు నోచుకోవడంలేదు. తగ్గింపుపై ప్రజలకు అవగాహన లేదు. ప్రస్తుత జిఎస్‌టి ధరలను షాపు యజమానులు డిస్‌ప్లే బోర్డులు ఏర్పాటు చేయడంలేదు. ఓల్డ్ స్టాక్ పేరుతో దోపిడీ చేస్తున్న వ్యాపారుల ఆగడాలకు చెక్ పెట్టాల్సిన అధికార యంత్రాంగం పట్టించుకోవడంలేదు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు దుకాణదారులకు అవగాహన కల్పిస్తూ ప్రస్తుత జిఎస్‌టి ధరలను షాపుల ఎదుట ప్రదర్శించాలని వినియోగదారులు కోరుచున్నారు.

దుకాణదారులకు అవగాహన కల్పిస్తాం
- పి.సరస్వతి, ఎంపిడిఒ గంపలగూడెం



ఇప్పటికే అవగాహన ర్యాలీ నిర్వహించి, సచివాలయ సిబ్బందితో డోర్ టు డోర్ క్యాంపెయిన్ నిర్వహిస్తున్నాం. దుకాణదారులకు ఆదేశాలిచ్చి తగ్గిన జిఎస్‌టి ధరలు అమలయ్యేలా చర్యలు తీసుకుంటాం.

ధరల పట్టికలు ఏర్పాటు : ప్రేమ రాజు, వైసిపి



జిఎస్‌టి తగ్గినా పాత ధరలే విక్రయిస్తున్నారు. దీని ద్వారా ప్రజలు నష్టపోతున్నారు. అధికారులు స్పందించి ధరల పట్టికలు ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకోవాలి.

రైతులకు అవగాహన కల్పించాలి
గువ్వల సీతారాంరెడ్డి, జిల్లా కౌలు రైతు సంఘం అధ్యక్షులు



కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన జీఎస్టీ తగ్గింపు ధరలు గంపలగూడెం మండలంలో అమలు కావడంలేదు. ఈ ప్రాంత రైతాంగానికి జిఎస్‌టిపై అవగాహన లేకపోవడంతో పాత ధర్లతోనే కొనుగోలు చేయాల్సి వస్తుంది. ప్రజలు, రైతులకు అవగాహన కల్పించి, తగ్గింపు ధరల అమలుకు చర్యలు తీసుకోవాలి.

కెజిబివికి స్వచ్ఛాంధ్ర అవార్డు



ప్రజాశక్తి - రెడ్డిగూడెం : స్వచ్ఛాంధ్ర అవార్డ్స్ -2025లో భాగంగా జిల్లా స్థాయి స్వచ్ఛ స్కూల్స్ కేటగిరీ కింద జిల్లా ఉత్తమ స్కూల్‌గా రెడ్డిగూడెం మండలం రంగాపురం గ్రామ పంచాయతీ పరిధిలోని కస్తూరిబాయి గాంధీ బాలికల విద్యాలయం ఎంపికైంది. ఈ అవార్డును మంగళవారం విజయవాడలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన జిల్లా స్థాయి అవార్డుల ప్రధానోత్సవంలో ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్ చైర్మన్ పట్టాభి చేతుల మీదుగా అవార్డును కెజిబివి ప్రిన్సిపాల్ మోదుగు శ్యామల, రెడ్డిగూడెం మండల పరిషత్తు డిప్యూటీ ఎంపీడీవో ప్రభాకర్ అందుకున్నారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఎస్ రామారావు పాల్గొన్నారు.

జుజ్జూరు పిఎసిఎస్ నూతన కార్యవర్గం బాధ్యతల స్వీకరణ

ప్రజాశకి- వీరులపాడు : ఎన్టీఆర్ జిల్లా వీరులపాడు మండలం జుజ్జూరు మండల కేంద్రంలో వ్యవసాయ సహకార సంఘం నూతన అధ్యక్షులుగా షేక్ రహమతుల్లా, డైరెక్టర్లుగా ఎంపికైన చెన్నుపాటి చౌరయ్య, షేక్ జానీ బుధవారం బాధ్యలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షులుగా బాధ్యతలు చేపట్టిన షేక్ రహమతుల్లా మాట్లాడుతూ.. వ్యవసాయ సాగుదారులు అందరికీ రైతు రుణాలు అందజేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో.. వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ అధ్యక్షులు బొమ్మిశెట్టి భాస్కరరావు నాగార్జునసాగర్ కంచికచర్ల ప్రాజెక్టు చైర్మన్ కాపా రాంబాబు తెలుగుదేశం నాయకులు ఎర్రగుంట కష్ణారావు జనసేన నాయకులు పసుపులేటి వర కుమార్ జంపాల రవికుమార్ పగడాల రాధాకష్ణ మైనార్టీ నాయకులు షేక్ సుభాని మరియు బ్యాంకు ఖాతాదారులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.



సూపర్ జిఎస్‌టిపై అవగాహన

ప్రజాశక్తి-విస్సన్నపేట: విస్సన్నపేటలోని వికాస్ పాలిటెక్నిక్ కాలేజీలో సూపర్ జీఎస్టీ - సూపర్ సేవింగ్స్‌పై విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ఈ పోటీలలో విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో వికాస్ పాలిటెక్నిక్ కాలేజీలో జీఎస్టీ తగ్గింపు ధరలపై వివిధ కార్యక్రమాలు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా కళాశాల చైర్మన్ నరేడ్ల నర్సిరెడ్డి, ట్రైనింగ్ అండ్ ప్లేస్మెంట్ ఆఫీసర్ డాక్టర్ చల్లా సుధీర్ రెడ్డి హాజరై మాట్లాడుతూ.. జీఎస్టీ తగ్గింపు ధరల వలన ప్రతి కుటుంబానికి లాభం చేకూరుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ కె.రమేష్, వైస్ ప్రిన్సిపల్ జి.వీరబాబు, తదితరులు పాల్గొన్నారు.



డీసిల్టింగ్ పనులు జరుగుతుండాలి

ప్రజాశక్తి-విజయవాడ : డిసిల్టింగ్ ప్రక్రియ నిరంతరంగా జరుగుతుండాలని విజయవాడ నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. బుధవారం ఉదయం తన పర్యాటన లో భాగంగా ఏలూరు రోడ్డు, గుణదల సెంటర్, పులేటి కట్ట రోడ్డు, ఈఎస్ఐ హాస్పిటల్ రోడ్డు, డెంటల్ కాలేజ్ రోడ్డు, గురునానక్ కాలనీ, వాసవి నగర్, న్యూ పిఎన్టి కాలనీ, పటమట ప్రాంతాలన్నీ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ డీసిల్టింగ్ ప్రక్రియను నిరంతరం చేస్తుండాలని, సైడ్ కాలువలో వ్యర్థాలను ఎప్పటికప్పుడు తొలగించాలని అధికారులను ఆదేశించారు.

లయనిజం అంటే సేవ - జిల్లా గవర్నర్ ఆంజనేయులు



ప్రజాశక్తి-మైలవరం : లయనిజం అంటే సేవ అని, ప్రపంచ వ్యాప్తంగా లయనిజం ఉందని లయన్ జిల్లా గవర్నర్ వివిపిఎస్ ఆంజనేయులు అన్నారు. లయన్స్ క్లబ్ ఆఫ్ మైలవరం ఆధ్వర్యంలో బుధవారం సేవా యజ్ఞం కార్యక్రమంలో భాగంగా పర్యావరణ పరిరక్షణ కోసం మొక్కలు నాటటం, అన్నదాన కార్యక్రమం, ఐస్క్రీనింగ్ క్యాంపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఆంజనేయులు పాల్గొని మాట్లాడుతూ గాంధీ జయంతి నుండి మెల్విన్ జోన్స్ జన్మదినోత్సవం వరకు సేవా యజ్ఞం కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం ఫాస్ట్ జిల్లా గవర్నర్ అన్నపరెడ్డి కోటిరెడ్డి విద్యార్థులకు కెరీర్ గైడెన్స్‌పై అవగాహన కల్పించారు. చైల్డ్ ఐ కేర్ క్యాంపు జిల్లా కోఆర్డినేటర్ వై శ్రీనివాసరావు ఉచితంగా 250 మంది విద్యార్థులకు కళ్ళజోళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఫస్ట్ వైస్ గవర్నర్ ఎన్‌విఎస్ఎస్ ప్రసాద్, సెకండ్ వైస్ గవర్నర్ చెన్నారెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జీఎస్టీ కోఆర్డినేటర్ కంచర్ల ముత్య ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

కల్తీ మద్యం అమ్మకాలపై విచారణ చేపట్టాలి : వైసిపి



ప్రజాశక్తి-కంచికచర్ల : కంచికచర్ల ఎక్సైజ్ శాఖ పరిధిలో కల్తీ మద్యం అమ్మకాలు జరిగాయనే ఆరోపణలపై నిజానిజాలు నిగ్గు తేల్చి సంబంధిత వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని వైసిపి పట్టణ అధ్యక్షుడు, గ్రామ ఉప సర్పంచ్ వేమా సురేష్ బాబు డిమాండ్ చేశారు. బుధవారం ఆయన కంచికచర్ల ప్రాతంలో వెలుగులోకి వస్తున్న కల్తీ మద్యం అమ్మకాలపై మీడియాకు ప్రకటన విడుదల చేశారు. కంచికచర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో ఎక్సైజ్ సిబ్బంది, వారి బినామీల పేరుతో మద్యం షాపు నిర్వహిస్తున్న విషయం ప్రజలందరికీ తెలుసన్నారు. కంచికచర్ల ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గల మద్యం షాపులు సిండికేట్‌లో బాధ్యతలు చూస్తున్న వ్యక్తి అధికార పార్టీ నాయకులు అనుచరుడే అన్నారు. అతనితో పోటు, ఎక్సైజ్ శాఖలో పనిచేస్తున్న సిబ్బందితో కలిసి ఇబ్రహీంపట్నంలోని నకిలీ మద్యం గోడౌన్ నుండి ఈ ప్రాంతంలో 3 మద్యం షాపులకు నకిలీ మద్యం సరఫరా చేశారని ఆరోపించారు. కంచికచర్లలో కల్తీ మద్యం అమ్మకాలపై ఉన్నతాధికారులు విచారణ జరిపి సంబంధించిన షాపుల లైసెన్స్ రద్దు చేసి, నిందితులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.



ముగిసిన ఫెన్సింగ్ పోటీలు

ప్రజాశక్తి-మైలవరం : స్థానిక లకిరెడ్డి హనీమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో గత రెండు రోజులుగా జరుగుతున్న కృష్ణా యూనివర్సిటీ మెన్ అండ్ ఉమెన్ ఫెన్సింగ్ పోటీలు బుధవారంతో ముగిశాయి. ఈ పోటీలలో బాలికల ఛాంపియన్‌షిప్‌ను కైకలూరు వైవియన్‌ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బాలుర ఫెన్సింగ్ ఛాంపియన్‌షిప్‌ను లకిరెడ్డి హనీమిరెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల కైవసం చేసుకున్నట్లు టోర్నమెంట్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మేజర్ మన్నే స్వామి తెలిపారు. నాలుగు బంగారు, మూడు సిల్వర్, మూడు బ్రాంజ్ మెడల్స్‌ను సాధించి కృష్ణా యూనివర్సిటీ ఓవరాల్ ఛాంపియన్‌షిప్‌గా నిలిచిందన్నారు. కృష్ణా యూనివర్సిటీ జట్టును పంజాబ్‌లోని గురునానక్ దేవ్ యూనివర్సిటీలో జరిగే విశ్వవిద్యాలయ పోటీలకు పంపటం జరుగుతుందని యూనివర్సిటీ స్పోర్ట్స్ బోర్డు సెక్రటరీ నవీన లావణ్య లతా తెలిపారు.

స్కూల్ గేమ్స్‌లో గురుకుల విద్యార్థుల ప్రతిభ




ప్రజాశక్తి - తిరువూరు : ఎస్‌జిఎఫ్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ అండర్-19 విభాగంలో తిరువూరు డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల విద్యాలయం ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు విజయకేతనం ఎగురవేశారు. గుడివాడ ఎన్టీఆర్ స్టేడియంలో బుధవారం జరిగిన పోటీల్లో విద్యార్థి ఎల్.సిద్దు లాంగ్ జంప్‌లో ద్వితీయస్థానం, డి.టైటాన్స్ నిరీక్షణ్ 800 మీటర్స్ రన్నింగ్, షాట్ పుట్‌లో ప్రథమ స్థానంలో నిలిచి స్టేట్ మీట్‌కు అర్హత సంపాదించారని ప్రిన్సిపాల్ ఎస్.రవి బాబు, పిడి వి.నాని బాబు, పిఈటి రాధాకష్ణ తెలిపారు.

నాగార్జున విద్యార్థి గిన్నీస్ రికార్డు

ప్రజాశక్తి - తిరువూరు : తిరువూరు నాగార్జున విద్యార్థిని కొంగల జెస్సీ కరాటే పోటీల్లో గిన్నిస్ వరల్డ్ రికార్డు సాధించింది. ది లార్జెస్ట్ కరాటే డిస్‌ప్లే వరల్డ్ కరాటే మాస్టర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో మాస్టర్ బాల మురుగన్ సమన్వయంతో చెన్నైలోని ఎస్ఐఈటి కాలేజీలో గిన్నిస్ వరల్డ్ రికార్డు కరాటే పోటీలు జరిగినట్లు ప్రిన్సిపాల్ కె.నరసింహారావు తెలిపారు. రేవంత్ డిఫెన్స్ స్కూల్ అకాడమీలో శిక్షణ పొందిన విద్యార్థిని ఉత్తమ ప్రతిభను కనబరిచి ప్రపంచ రికార్డు సృష్టించి దేశానికి గౌరవం తీసుకొచ్చిందని చెప్పారు. సందర్భంగా విద్యార్థినిని బుధవారం పాఠశాలలో ప్రిన్సిపాల్‌తోపాటు వైస్ ప్రిన్సిపాల్ రాయల సురేష్, ఉపాధ్యాయులు అభినందించారు.

54 మందికి ఉచిత కంటి పరీక్షలు

ప్రజాశక్తి-ఘంటసాల : గ్రామీణ ప్రాంత ప్రజలకు ఉచిత కంటి పరీక్షలు నిర్వహించిన సాయి దుర్గా క్లీనిక్, ఆప్టికల్స్ వైద్యుల సేవలు అనిర్వచనీయమని పలువురు కొనియాడారు. ఘంటసాల మండల పరిధిలోని వేములపల్లి గ్రామంలో బుధవారం ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్యశిబిరంలో 54 మంది సేవలు పొందినట్లు వైద్యులు రామారావు, రేఖ తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి ఆర్.సురేష్ బాబు గ్రామప్రముఖులు వాసిరెడ్డి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.



అధికారులతో చర్చిస్తున్న ఎంఎల్ఎ రాము

గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి : ఎంఎల్ఎ

ప్రజాశక్తి - గుడివాడ : గుడివాడ నియోజకవర్గంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాల ద్వారా పేదల ఇళ్ల నిర్మాణాలపై అధికారులు దృష్టి పెట్టాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము కోరారు. బుధవారం ఏలూరురోడ్డు టిడిపి కార్యాలయంలోని ప్రజా వేదికలో హౌసింగ్ అధికారులతో త్వరలో చేపట్టనున్న ప్రధానమంత్రి ఆవాస్ యోజన నిర్మాణాలపై ఎమ్మెల్యే రాము సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలోని పేద మధ్య తరగతి వర్గాల సొంతింటి కలను నిజం చేసేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కృషి చేస్తున్నాయన్నారు. ప్రజల నుండి ఫిర్యాదులు రాకుండా హౌసింగ్ అధికారులు జవాబుదారీ తనంతో పని చేయాలన్నారు. పేద మధ్యతరగతి వర్గాల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. ఈ కార్యక్రమంలో హౌసింగ్ డిఇఇ శివ ప్రసాద్, గుడ్లవల్లేరు ఏ.ఈ సురేంద్ర, నందివాడ, రూరల్, అర్బన్, ఏ.ఈలు సాయిపవన్, పద్వి, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

ఆలయ ప్రతిష్టా మహోత్సవాలు

ప్రజాశక్తి-అవనిగడ్డ : అవనిగడ్డ ఏడవ వార్డులో పునర్ నిర్మించిన శ్రీ హనుమంత్, సీతా లక్ష్మణ సమేత కోదండ రామస్వామి, భూదేవి, శ్రీదేవి సమేత కళ్యాణ కళ్యాణ వెంకటేశ్వర స్వామి వారి, వాసవి కన్యకా పరమేశ్వరి అమ్మవార్ల నూతన ఆలయ ప్రతిష్ట మహెూత్సవాలు బుధవారం జరిగాయి. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మంత్రి కొల్లు రవీంద్ర ,అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధ ప్రసాద్ ముఖ్య అతిథులుగా విచ్చేసి నూతన విగ్రహాల ప్రతిష్ట మహెూత్సవంలో పాల్గొన్నారు. అనంతరం మంత్రి రవీంద్ర, ఎమ్మెల్యే బుద్ధ ప్రసాద్ నూతన ప్రతిష్ట మూర్తులను దర్శించుకున్నారు. ఆలయ కమిటీ పెద్దలు, వేద పండితులు వారిని ఘనంగా సత్కరించారు.


డ్రైనేజీ ఆక్రమించి అక్రమంగా నిర్మాణాలు



ప్రజాశక్తి-మచిలీపట్నం అర్బన్ : మచిలీపట్నం స్థానిక సుకర్లబాద పదవ డివిజన్‌లో ప్రభుత్వ మున్సిపల్ స్థలం, డ్రైన్ పై పలువురు శాశ్వత కట్టడాలు కడుతూ ఆక్రమణకు పాల్పడుతున్నారు. ఇంత జరుగుతున్న స్థానిక సచివాలయ సిబ్బంది, నగరపాలక సంస్థ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని స్థానికుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. స్థానికులు ఇచ్చిన సమాచారం ప్రకారం పదవ డివిజన్ సుకర్లాబాద్ మస్జిద్ రోడ్‌లో మున్సిపల్ స్థలమును ఆక్రమించి శాశ్వత నిర్మాణం చేశారు. తన సరిహద్దులలో నిర్మించిన ప్రహరీ గోడను దాటి మున్సిపల్ స్థలం, డ్రైనేజీ ఆక్రమించి కమర్షియల్ షాపు నిర్మించారు. రెండు నెలలుగా సాగుతున్న నిర్మాణ పనులను కనీసం సచివాలయ ప్లానింగ్ సిబ్బంది, నగరపాలక సంస్థ అధికారులు అడ్డుకోలేదని స్థానికులు నుండి తీవ్రంగా విమర్శలు వినిపిస్తున్నాయి. అదే రోడ్లో స్థానిక ఇంటి యజమానులు కొందరు ఒకరికొకరు పోటీపడుతూ ఇల్లు కట్టడాలతో కార్పొరేషన్ రోడ్డును ఆక్రమించుకుంటున్నారు. ఈ సమస్యపై నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్ అధికారి చంద్రశేఖర్ ను వివరణ కోరగా స్థానికుల నుంచి తమకు ఎటువంటి ఫిర్యాదు అందలేదని అయినప్పటికీ ఆక్రమించి డ్రైనేజీ పై చేపట్టిన నిర్మాణాలను తొలగిస్తామని పేర్కొన్నారు.

పంచాయతీ సిబ్బంది అందుబాటులో లేక ఇబ్బందులు

ప్రజాశక్తి-మొవ్వ : సమస్యలు పరిష్కారం కోసం కార్యాల యానికి వెళ్లిన ప్రజలు అధికారులు లేకపోవడంతో విసుగు చెందుతున్నారు. పనులు కోసం వెళ్లిన ప్రజలకు సమాధానం చెప్పేందుకు కార్యాలయంలో ఒక ఉద్యోగి కూడా లేకపోవడం బాధాకరం. కనీసం అటెండర్ కూడా లేకపోవడం సమస్యలు ఎవరికి విన్నవించుకోవాలో తెలియక కార్యాలయానికి వచ్చిన ప్రజలు ఆవేదన చెందుతున్నారు. పంచాయతీ కార్యాలయంలో పనిచేస్తున్న కార్యదర్శికి మండలంలోని పెదముత్తేవి గ్రామంలో ఇంచార్జిగా బాధ్యతలు నిర్వహించడంతో మొవ్వ మండల కేంద్రంలోని కార్యాలయంలో కనబడటం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. కార్యదర్శి ఫోన్ చేసిన సమాధానాలు రావడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. మండల కేంద్రంలో ని మేజర్ పంచాయతీ కార్యాలయంలో సిబ్బంది అందుబాటులో లేకపోవడంపై పలు అనుమా



నాలు వ్యక్తం అవుతున్నాయి. ప్రభుత్వం నుండి జీతం తీసుకుంటూ విధులు నిర్వహించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కార్యాలయం సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు. ఇంటి పన్ను, మరణ ధ్రువీకరణ పత్రం కోసం పంచాయతీ కార్యాలయానికి వెళితే పత్రం ఇచ్చే నాథుడు గాని ఇంటి పన్ను చెల్లించుకునే అధికారి కూడా లేకపోవడంతో ప్రజలు వెనక్కు తిరిగి వస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు గ్రామంలో ఎక్కడ పడితే అక్కడ గుంటల్లో మురుకు నీరు చేరి నిల్వ ఉండడంతో దోమలు వ్యాప్తి చెంది అనారోగ్యాల పాలవుతున్నారని గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు.

స్వమిత్వ సర్వే పకడ్బందీగా చేపట్టాలి : కలెక్టర్

ప్రజాశక్తి-కంకిపాడు : ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా స్వమిత్వ సర్వే పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులను ఆదేశించారు. బుధవారం కంకిపాడు మండలం దావులూరు గ్రామంలో స్వమిత్వ సర్వేను పరిశీలించారు. తొలుత ఆయన గ్రామంలోని గ్రామపంచాయతీ కార్యాలయాన్ని సందర్శించి స్వమిత్వ సర్వేకు సంబంధించిన రిజిస్టర్లు, మ్యాపులను పరిశీలించారు. అనంతరం ఆయన రెవెన్యూ అధికారులు, సర్వేయర్లతో కలిసి గ్రామంలో క్షేత్రస్థాయిలో పర్యటించారు. గహాల వద్దకు వెళ్లి చేసిన సర్వేను రికార్డులతో సరిపోలుస్తూ పరిశీలించారు. కొంతమంది గ్రామస్తులతో మాట్లాడి సర్వే చేస్తున్న విధానంపై అభిప్రాయాలను అడిగి తెలుసుకున్నారు. సర్వేకు ముందు సంబంధిత భూ యజమానికి నోటీసుల ద్వారా తప్పనిసరిగా తెలియజేయాలని కలెక్టర్ సిబ్బందికి సూచించారు. ఈ పర్యటనలో ఉయ్యూరు ఆర్డీవో బీఎస్ హేలా షారోన్, సర్వే ఏడి



అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్

జోషిలా, తాహసిల్దార్ భవన్నారాయణ పాల్గొన్నారు.

సచివాలయాన్ని సందర్శించిన కలెక్టర్

కలెక్టర్ డీకే బాలాజీ పెనమలూరు మండలం పోరంకిలోని 3వ సచివాలయాన్ని సందర్శించి సర్వేకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. సంబంధిత సచివాలయ పరిధిలోని పొలాలు,ఇళ్ల స్థలాలకు సర్వే చేయాలని గతంలో అర్జీ పెట్టుకున్న దరఖాస్తులను పరిశీలించి ఆయన అర్జీదారులతో నేరుగా చరవాణి ద్వారా మాట్లాడారు. సర్వేయర్లు వచ్చి మీ భూమికి సర్వే చేశారా, సర్వేకు ముందు నోటీసు ద్వారా లేదా ఫోన్ ద్వారా తెలియజేశారా లేదా, సర్వే సమ యంలో సిబ్బంది డబ్బులు డిమాండ్ చేశారా వంటి విషయాలపై కలెక్టర్ ఆరా తీసి వివరాలను తెలుసుకున్నారు.

ముళ్లపూడి గ్రామాభివృద్ధికి కృషి : సర్పంచ్



ప్రజాశక్తి-పమిడిముక్కల : ముళ్ళపూడి గ్రామాబి.వృద్ధికి కట్టుబడి ఉన్నట్లు గ్రామ సర్పంచ్ పక్కాల అంజిబాబు అన్నారు. బుధవారం ఆయన మాట్లాడుతూ గ్రామంలో తాగునీర,ు విద్యుత్తు రోడ్ల నిర్మాణం చేపట్టామన్నారు. ఎన్ఆర్‌జిఎస్ నిధుల ద్వారా గ్రామంలో అంతర్గత రోడ్లు నిర్మాణం చేశామని, పాఠశాల అంగన్వాడీ సెంటర్లను అభివృద్ధి చేశామని తెలిపారు. గ్రామాభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగుతున్నట్లు ఆయన తెలిపారు.

ఉయ్యాలలు ప్రారంభం



ప్రజాశక్తి-కోడూరు : అట్లతద్ది పండుగను పురస్క రించుకుని కోడూరు గ్రామ పంచాయతీ పరిధిలోని స్వతంత్రపురం గ్రామంలో తెలుగు దేశం పార్టీ బూత్ ఇంచార్జ్ వీరంకి వెంకటేశ్వ రరావు ఏర్పాటు చేసిన ఉయ్యాలను కోడూరు మండలం తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు మాజీ జెడ్పిటిసి సభ్యులు బండే శ్రీనివాసరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా బండే శ్రీనివా సరావు మాట్లాడుతూ అట్లతద్ది సందర్భంగా ఉయ్యాలలు ఏర్పాటు చేసుకోవడం ప్రాచీన కాలం నుండి వస్తున్న సంప్రదా యమని అన్నారు. ఉల్లిపాలెం, విశ్వనాథపల్లి పిఎసిఎస్ అధ్యక్షులు బొలిశెట్టి విటల్ రావు, తోట సాంబశివరావు, క్లస్టర్ ఇంచార్జ్ కొక్కిలిగడ్డ జాన్ విల్సన్ ,ఐ టి డి పి కోడూరు కోఆర్డినేటర్ వేములపల్లి రాజేష్, పిల్లి మల్లికా ర్జున రావు, తాత పోతురాజు ,తోట సూర్య నరసింహారావు పాల్గొన్నారు.

రైతుబజారు ఎస్టేట్ అధికారికి సన్మానం

ప్రజాశక్తి-మొవ్వ : కూచిపూడిలో గల రైతుబజార్ స్వచ్ఛ-ఆంధ్ర రాష్ట్రస్థాయి అవార్డు పొందటంతో ఆ రైతు బజార్ ఎస్టేట్ ఆఫీసర్ కె చంద్రమోహనరావును బుధవారం రైతు బజార్లో, వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో వేర్వేరుగా సన్మానం చేశారు. ముఖ్యఅతిథిగా మార్కెటింగ్ శాఖ ఏడి (మచిలీపట్నం) ఎల్. నిత్యానందం పాల్గొని ఎస్టేట్ ఆఫీసర్ తో పాటు సిబ్బంది సేవలను కొనియాడారు. ఏఎంసీ ఛైర్మన్ దోనేపూడి శివరామయ్య, కార్యదర్శి అక్బర్ బాషా , గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు వెంపటి గోపాలకష్ణ పాల్గొన్నారు.

సబ్ స్టేషన్ నిర్మాణం ప్రారంభించాలి

ప్రజాశక్తి-ఉయ్యూరు : ఉయ్యూరులో 2022-2023 సంవత్సరంలో మంజూరైన 133/33 కేవీ విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణ పనులు ప్రారంభించకపోవడంపై ఇందన శాఖ ముఖ్య కార్యదర్శి కె. విజయానంద్ ఏపీ ట్రాన్స్కో జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ (విజిలెన్స్) గుణదలను విచారణకు ఆదేశించినట్టు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ తెలిపారు. ఉయ్యూరులో మంజూరైన 133/33 కేవీ సబ్ స్టేషన్ నిర్మాణం ప్రారంభించక పోవడంతో వినియోగ దారులు ఎదుర్కొంటున్న సమస్యలు తెలియజేస్తూ నిర్మాణ పనులు చేపట్టాలని ఏపీ ట్రాన్స్కో కనస్ట్రక్షన్ వింగ్ ఎగ్జిగ్యూటివ్ ఇంజనీర్, ఏపీ ట్రాన్స్కో ఎస్ఈ (ఓఅండ్ ఎమ్) సర్కిల్, ఏపీసీపీడీసీఎల్ ఛైర్మన్ అండ్ ఎండీ తగుచర్యలు తీసుకోవాలని తెలియజేస్తూ ఆగస్టు 13న ఇందన శాఖ ముఖ్య కార్యదర్శికి చేసిన ఫిర్యాదు మేర విచారణకు ఆదేశించినట్టు శ్రీనివాసగౌడ్ తెలిపారు.

కుక్కకాటుకు గురైన బాలికకు పరామర్శ

ప్రజాశక్తి - గుడివాడ : కుక్క కాటుకు గురైన బాలిక మోక్షాను సామాజిక కార్యకర్త డాక్టర్ మాచర్ల రామకృష్ణ(ఆర్‌కె) బుధవారం ప్రభుత్వ ఏరియా ఆసుపత్రిలో పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుడివాడ రూరల్ మండలంలోని రామనపూడిలో ఈ నెల 7వ తేదీ సాయంత్రం కుక్కకాటుకు గురైన ఆరేళ్ల బాలిక తల్లిదండ్రులకు ధైర్యం తెలిపి, ప్రభుత్వ వైద్యులతో మాట్లాడి మెరుగైన వైద్యం అందజేయాలని కోరారు. అనంతరం ఆర్‌డివో కార్యాలయం ఏఓ బాలాజీకి వినతి పత్రాన్ని అందజేశారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా ధాన్యం సేకరణ : తహశీల్దార్

ప్రజాశక్తి-ఘంటసాల : అధికారులు, మిల్లర్ల సమన్వయంతో పని చేసి రైతులకు ఇబ్బంది కలగకుండా ధాన్యం సేకరణ చేయాలని తహసీల్దార్ బి.విజయ ప్రసాద్ అన్నారు. ఘంటసాల మండలంలోని ధాన్యం సేకరణ పై ప్రణాళిక రూపొందించేందుకు తహసీల్దార్ కార్యాలయంలో మిల్లర్లు, వ్యవసాయ, రెవెన్యూ శాఖ, పీఏసీఎస్ కార్యదర్శులతో బుధవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయ ప్రసాద్ మాట్లాడుతూ ఘంటసాల మండలంలో ధాన్యం సేకరణకు ఐదు మిల్లులు గుర్తించినట్లు చెప్పారు. ఆయా మిల్లుల్లో సరిపడా గోనె సంచులు ఉన్నట్లు చెప్పారు. ఖరీఫ్ వరి సాగు దిగుబడులు త్వరలో ప్రారంభం అవుతాయని, వరి పంటను ఈ - క్రాఫ్ చేయడం వలన ఎంత దిగుబడి వస్తుందో గ్రామస్థాయిలో అధికారులు ముందుగా అంచనా రూపొందించాలన్నారు. రైతులతో ఈకేవైసీ చేయించడం వలన రైతులు, పంట సాగు వివరాలు, ఏఏ ప్రాంతంలో దిగుబడి వస్తుందో గుర్తించి రైతులకు రవాణ, గోనె సంచులు అందజేయాలని సూచించారు. వరి పంటలో తేమ 17 శాతం ఉండే విధంగా రైతులకు అవగాహన కల్పించాలన్నారు. తేమ శాతం సక్రమంగా ఉంటే గిట్టుబాటు ధర రైతులకు అందుతుందని, సకాలంలో ధాన్యాన్ని మిల్లులకు తరలించేలా చూడాలన్నారు.ప్రతి రైతులు ధాన్యం జీపీఎస్ వాహనాల్లోనే తరలించాలన్నారు. అనంతరం ఘంటసాల మండలంలోని కొడాలి, తాడేపల్లి, చిట్టూర్పు గ్రామాల్లోని ధాన్యం సేకరణకు సంబందించిన మిల్లులను తనఖీ చేశారు. ఆయా కార్యక్రమాల్లో పీడీఎస్ డీటీ కొడాలి శ్రీనివాసరావు, మండల ఇన్చార్జి ఏవో డి.అనూష, ఆర్ ఐ కె.శ్రీనివాస్, వీఆర్వోలు పాల్గొన్నారు.



మిల్లుల వద్ద గోను సంచులు తనిఖీ చేస్తున్నా తహసీల్దార్

రక్షిత నీరు అందించడంలో ప్రభుత్వం విఫలం

- సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ



ప్రజాశక్తి - ఇబ్రహీంపట్నం: కొండపల్లి మున్సిపాలిటీ ప్రజలకు సురక్షిత మంచినీరు అందించడంలో టిడిపి కూటమి ప్రభుత్వం విఫలమైందని సిపిఎం ఎన్‌టిఆర్ జిల్లా కార్యదర్శి డివి కృష్ణ అన్నారు. బూడిదతో మంచినీటిని కలుషితం చేస్తూ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న డాక్టర్ ఎన్‌టిపిపిఎస్ అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కొండపల్లి మున్సిపాలిటీ పరిధిలో మంచినీటి సమస్యపై కొండపల్లి మున్సిపాలిటీ కార్యాలయం ముందు బుధవారం సిపిఎం ఆధ్వర్యంలో స్థానిక మహిళలు నిరసన తెలిపారు. ఈ కార్యక్రమంలో డివి కృష్ణ మాట్లాడుతూ తాగే మంచినీటిలో విటిపిఎస్ బూడిద కలవడంతో ప్రజలు తీవ్ర అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రస్తుతం ప్రజలు విష జ్వరాల వల్ల అనారోగ్య సమస్యలు ఎదుర్కొంటూ ఆస్పత్రులకు వేలకు వేలు చెల్లించలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. కృష్ణా నది కూత వేటు దూరంలో ఉన్న గ్రామాలకు మంచినీరు అందించలేకపోవడం దారుణమన్నారు. ఈ ప్రాంతంలో మద్యం ఏరులై పారుతోందని, మంచినీరు మాత్రం అందించలేకపోవడం విడ్డూరంగా ఉందన్నారు. ప్రభుత్వం స్పందించి ప్రజలకు సురక్షితమైన మంచినీరు అందించాలని డిమాండ్ చేశారు. ధర్నాలో సిపిఎం టౌన్ కమిటీ సభ్యులు ఎస్‌కె భాష, సీనియర్ నాయకులు ఆలేటి విఠలరావు, వీటీపీఎస్ సిఐటియు నాయకులు కె నారాయణ, ఐద్వా నాయకులు కానుకుర్తి బేబీ, బాడిస వెంకటేశ్వరరావు, స్థానిక మహిళలు బాజీబీ, పద్మ, మస్తాన్ బి మౌలాబి, వెంకట్రావమ్మ, నాగుల్ బి, తదితరులు పాల్గొన్నారు.



ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయాలి

విజయవాడ : ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేయాలని నూజివీడు డిప్యూటీ ఎడ్యుకేషన్ ఆఫీసర్ తెలిపారు. తోటపల్లి హీల్ పేరడైజ్ పాఠశాలలో గత ఐదు రోజులుగా జరుగుతున్న మెగా డీఎస్సీ -2025 ఉపాధ్యాయుల శిక్షణ శిబిరాన్ని ఆయన బుధవారం సందర్శించి మాట్లాడారు. ఉపాధ్యాయులు అంకిత భావంతో పని చేసి రాష్ట్రంలో విద్యా ప్రమాణాలు మెరుగుపరచాలని తెలిపారు. ఇందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్ బయలాజికల్ సైన్స్ ఫోరం తరపున ఎన్టీఆర్ జిల్లా ఫోరం అధ్యక్షులు డాక్టర్ మామిడి శ్రీనివాస్‌రావు సహకారంతో సుధాకర్ చేతుల మీదగా బయలాజికల్ సైన్స్ ఉపాధ్యాయులకు జ్యూట్ బ్యాగు, స్టడీ మెటీరియల్ అందజేశారు.

దుర్గమ్మను దర్శించుకున్న ఎంపి విజయేంద్ర ప్రసాద్

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : రాజ్యసభ సభ్యులు, ప్రముఖ సినీ రచయిత విజయేంద్ర ప్రసాద్ బెజవాడ కనక దుర్గమ్మను దర్శించుకున్నారు. బుధవారం ఇంద్రకీలాద్రికి చేరుకున్న విజయేంద్ర ప్రసాద్‌కు ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. దర్శనానంతరం వేద పండితులు విజయేంద్ర ప్రసాద్‌కు వేద ఆశీర్వచనం అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ అధికారులు అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రాన్ని విజయేంద్ర ప్రసాద్‌కు బహుకరించారు.



వృద్ధురాలి హత్య కేసులో నిందితులు అరెస్ట్

ప్రజాశక్తి - విజయవాడ సిటీ : భవానీపురం పోలీస్ స్టేషన్ పరిధిలోని గొల్లపూడి బొమ్మసాని సుబ్బారావు నగర్‌లో మురుగు కాలువలో ఓ గుర్తు తెలియని వృద్ధురాలి మృతదేహం బయటపడిన విషయం తెలిసిందే. ఈ కేసును సవాల్ తీసుకున్న భావనీపురం పోలీసులు ప్రత్యేక బృందాలుగా ఏర్పడి కీలకమైన ఆధారాలతో నిందుతులను అరెస్ట్ చేశారు. భవానిపురం పోలీస్ స్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వెస్ట్ ఏడిసీపీ గుణ్ణం రామకృష్ణ ఈ కేసు వివరాలు వెల్లడించారు. ఈ నెల 1న చిట్టినగర్ వాసవి కల్యాణ మండపానికి వెళ్లిన పొత్తూరి విజయలక్ష్మి అదశ్యమైనట్లు కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారు. అదే రోజు సాయంత్రం 4 గంటల ప్రాంతంలో గొల్లపూడి బొమ్మసాని నగర్‌లో ఓ మహిళ మతదేహం లభ్యమైనట్లు పోలీసులకు సమాచారం అందింది.. ఏసీపీ దుర్గారావు, ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వరరావు పర్యవేక్షణలో ప్రత్యేక బందాలు సంఘటన స్థలానికి చేరుకుని దర్యాప్తు ప్రారంభించారు. సీసీటీవీ ఫుటేజ్ ఆధారంగా వంకదార హనుమాన్ సుబ్రమణ్యం పల్సర్ బైక్‌పై ఆ వద్ధురాలిని హెచ్‌బి కాలనీలోని తన నివాసానికి తీసుకెళ్లినట్లు గుర్తించారు. హనుమాన్ సుబ్రహ్మణ్యం, ఆయన కుమారుడు లక్ష్మీనరసింహస్వామి మాత్రమే ఆ ఇంటి నుండి బయటకు వచ్చినట్లు సీసీటీవీ ఫుటేజ్‌లో తేలింది. అనుమానితులపై నిఘా ఉంచిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకొని ప్రశ్నించడంతో విజయలక్ష్మి హత్య ఉదంతం వెలుగుచూసిందని ఎడిసిపి వెల్లడించారు. ఆమెకు కుమారుడి వరుసయ్యే సుబ్రహ్మణ్యం ముక్కలుగా అతి కిరాతకంగా హత్య చేసినట్లుగా గుర్తించామని, నిందితున్ని అదుపులోకి తీసుకుని హత్యకు ఉపయోగించిన ఆయుధాలతో పాటు హత్యకు గురికాబడిన వద్ధురాలి ఆభరణాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు.

కంప్యూటర్ రంగంలో క్వాంటం సెక్యురిటీ విప్లవం

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్: రాబోయే రోజుల్లో అంతర్జాల వేగం సమూలంగా మారబోతోందని యాక్ట్ ఫైబర్నెట్ (బెంగళూర్) జనరల్ మేనేజర్ తుమ్మల సీతారామారావు అన్నారు. బుధవారం విజయవాడలోని పి.బి.సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల కంప్యూటర్ సైన్స్ విభాగం ఏర్పాటు చేసిన సాంకేతిక సదస్సులో ఆయన పాల్గొన్నారు. ఎంస్సీ కంప్యూటర్ సైన్స్, ఎంసిఎ విద్యార్థులను ఉద్దేశించి సీతారామారావు మాట్లాడుతూ కొత్తగా వచ్చిన వై-ఫై 6, వైఫై 7 ద్వారా ఎక్కువ పరికరాలు వేగంగా కనెక్ట్ అవుతాయన్నారు. క్లౌడ్ ఆధారిత రౌటింగ్, ఫైర్వాల్, వీపీఎన్ సేవలతో కనెక్టివిటీ బాగా మెరుగుపడిందన్నారు. ఏఐ ఆధారంగా నెట్‌వర్క్ మానిటరింగ్ చేసి, నెట్‌వర్క్‌పై సైబర్ దాడులను ముందుగానే గుర్తించవచ్చన్నారు. క్వాంటం కంప్యూటింగ్ ఆధారంగా రాబోతున్న డేటా ట్రాన్స్‌మిషన్, క్వాంటం ఎన్ క్రిప్షన్ సైబర్ సెక్యూరిటీ పరంగా భవిష్యత్తులో విప్లవాత్మక మార్పులు తెస్తాయన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డైరెక్టర్ వేమూరి బాబురావు, డీన్ డాక్టర్ రాజేష్ సి జంపాల, కంప్యూటర్ సైన్స్ విభాగ అధిపతి టి.ఎస్.రవికిరణ్, తదిరులు పాల్గొన్నారు.



బిసిలకు అధిక ప్రాధాన్యత

- నగరాల కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణ స్వీకారోత్సవంలో నేతలు

ప్రజాశక్తి - విజయవాడ అర్బన్ : సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా టిడిపితోనే బిసిలకు ప్రాధాన్యత వచ్చిందని ఆ పార్టీ ఎన్‌టిఆర్ జిల్లా అధ్యక్షుడు, కేడీసీసీ బ్యాంక్ ఛైర్మన్ నెట్టెం రఘురాం అన్నారు. రాష్ట్ర నగరాల వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్, డైరెక్టర్ల ప్రమాణస్వీకార కార్యక్రమాన్ని బుధవారం నగరంలోని తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గౌడ కార్పొరేషన్ ఛైర్మన్ వీరంకి వెంకట గురుమూర్తి అధ్యక్షత వహించగా ముఖ్య అతిథిగా విచ్చేసిన నెట్టెం రఘురాం మాట్లాడుతూ బిసిల అభ్యున్నతి కోసం అందరూ అండగా నిలబడాలని సూచించారు. నగరాల వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఛైర్మన్‌గా మరుపిళ్ళ తిరుమలేశ్వరరావుతో పాటు డైరెక్టర్లుగా నియమితులైన వారితో నెట్టెం రఘురామ్ ప్రమాణం చేయించారు. మాజీ ఎంపి, టిడిపి కృష్ణా జిల్లా అధ్యక్షుడు, ఆర్టీసీ ఛైర్మన్ కొనకళ్ళ నారాయణ మాట్లాడుతూ.. నగరాల కార్పొరేషన్ చైర్మన్‌గా ప్రమాణం చేసిన మరుపిళ్ళ తిరుమలేశ్వరరావు(తిరుమలేష్) మాట్లాడుతూ తన బాధ్యతను సక్రమంగా నిర్వహించడంతో పాటు జాతి అభ్యున్నతికి పాటుపడతానన్నారు. రాష్ట్ర ఎక్సైజ్ శాఖా మంత్రి కొల్లు రవీంద్ర కార్పొరేషన్ ఛైర్మన్, డైరెక్టర్లుగా ప్రమాణం చేసిన వారిని ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి కె.నాగుల్‌మీరా, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు బొమ్మసాని సుబ్బారావు, ఎం.ఎస్.బేగ్, వివిధ కార్పొరేషన్‌ల ఛైర్మన్లు, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



కాలం చెల్లిన మందులు విక్రయిస్తే చర్యలు కలెక్టర్ జి.లక్ష్మీశ

ప్రజాశక్తి - ఎడ్యుకేషన్

జిల్లాలోని ఔషధ దుకాణాల్లో కాలం చెల్లిన, నిషేధిత మందులు విక్రయిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.లక్ష్మీశ హెచ్చరించారు. కలెక్టర్ లక్ష్మీశ బుధవారం కలెక్టర్ కార్యాలయంలో ఔషధ విభాగం అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో ఔషధ దుకాణాల కార్యకలాపాలపై ఆరా తీశారు. అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో నిబంధనల మేరకు దుకాణాలు నిర్వహించేలా నిరంతర పర్యవేక్షణ అవసరమని స్పష్టం చేశారు. అనుభవంలేని వ్యక్తులు మందులు విక్రయిస్తే కేసులు నమోదు చేసి కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. ఏ దుకాణంలోనైనా ఫార్మసిస్టులు లేకుండా ఔషధాలు విక్రయిస్తే చర్యలు తప్పన్నారు. తప్పనిసరిగా ప్రిస్క్రిప్షన్ ప్రకారం మాత్రమే ఫార్మసిస్టులు ఔషధాలు అందించాలని తెలిపారు. డ్రగ్ ఇన్స్పెక్టర్లు ఆకస్మిక తనిఖీలు నిర్వహించాలని.. ఎప్పటికప్పుడు తనిఖీలకు సంబంధించి నివేదికలు అందించాలని ఆదేశించారు.

కళ్లకు నల్ల రిబ్బన్లు కట్టుకొని నిరసన

ప్రజాశక్తి-విజయవాడ : తొమ్మిది నెలలు పెండింగ్ ఉన్నా జీతాలు ఇవ్వకుండా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ స్మృతివనం కార్మికుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న కాంట్రాక్టర్ రవికిరణ్‌పై అధికారులు చర్యలు తీసుకోవాలని సిఐటియు ఎన్టీఆర్ జిల్లా ఉపాధ్యక్షురాలు ఏ.కమల డిమాండ్ చేశారు. పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని కోరుతూ డాక్టర్ అంబేద్కర్ స్మృతి వనం కార్మికులు బుధవారం కళ్లకు నల్ల రిబ్బన్‌లు కట్టుకొని వినూత్నంగా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కమల మాట్లాడుతూ... కార్మికుల సమస్యలను పరిష్కరించకపోతే సిఐటియు నేతృత్వంలో ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఇప్పటికయినా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం తక్షణమే స్పందించి కార్మికుల వేతనాలను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిఐటియు సెంట్రల్ సిటీ కార్యదర్శి యం.బాబురావు, కాంట్రాక్ట్ కార్మికులు పి.సునీత, సి.హెచ్.విజయ్ కుమారి,పి.మేరీ,ఎం.సుజాత, కె.అనుష, ఎం.దీపిక, హెచ్.హరిత, కె.ధనలక్ష్మి, పి.సత్యవతి, మల్లిక,ఎస్.కె జహిందా, మణెమ్మ, లాము ధయామణీ పాల్గొన్నారు.



బిబిఎ హాలులో మహిళా ఉద్యమనేత, న్యాయవాది జ్యోత్స్నకు ఘన నివాళి

ప్రజాశక్తి-విజయవాడ : సీనియర్ న్యాయవాది, ఎపి బార్ కౌన్సిల్ సభ్యులు సుంకర రాజేంద్రప్రసాద్ సతీమణి, న్యాయవాది, మహిళా హక్కుల ఉద్యమ నాయకురాలు జి.జ్యోత్స్న ప్రథమ వర్ధంతి కార్యక్రమం బుధవారం నగరంలోని బెజవాడ బార్ అసోసియేషన్‌లో హాలులో జరిగింది. ఈ సందర్భంగా న్యాయవాదులు ఆమె చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. అనంతరం బెజవాడ బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎకె.బాషా మాట్లాడుతూ జ్యోత్స్న మరణం న్యాయవాదులకే కాక మహిళా ఉద్యమానికి తీరని లోటన్నారు. సమాజంలో చైతన్యానికి, మహిళల హక్కులు, వారి సంక్షేమం కోసం జోత్స్న కృషి చేశారని, ఎన్నో సాంఘిక సేవా కార్యక్రమాలు చేపట్టారని గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో ఆమె భర్త సుంకర రాజేంద్ర పసాద్, కుటుంబ సభ్యులు, పలువురు న్యాయవాదులు, బిబిఎ కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

